honeybee.org
Vol-8 Issue-3

సంపుటి 8 సంచిక 3 మార్చి - ఏప్రిల్ 2020

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక



## గ్రామీణ రవాణా సాధనం



# చిన్నవైతేనే స్థిరంగా చిరకాలం ఉంటాయా?



అడవి అంచున ఒక మహావృక్షం ఉండేది. దాని కొమ్మలు రాజసంతో ఉట్టిపడేవి, వేళ్ళు బాగా విస్తరించి ఉండేవి. అది ఎండనుంచి బాటసారులకి నీడనిచ్చేది. అదేవిధంగా దాని కొమ్మలు అనేక పక్షులకి, జీవాలకి ఆశ్రయమిచ్చేవి. ఆ చెట్టు ఎప్పుడూ కోలాహలంగా కళకళలాడుతూ వుండేది. ఈ మహావృక్షం వేళ్ళదగ్గరే ఒక చిన్న మొక్క ఉండేది. అది బలహీనంగా నాజూగ్గా వుండి చిన్న గాలి వస్తే చాలు వంగిపోయేది.

ఒకరోజు ఈ రెండు మాట్లాడుకుంటూ వుంటే వృక్షం 'ఒరే చిన్నోడా నాలాగే నువ్వూ నీ కాళ్ళు భూమిలోకి లోతుగా పాతి తలపైకెత్తి ఠీవిగా ఎందుకుండవు?' అని అడిగింది. దానికా చిన్న మొక్క 'నాకా అవసరం కన్పించలేదు, నిజానికి నేనిలాగే సురక్షితంగా ఉన్నాను' అన్నది. దానికా వృక్షం 'ఏంటీ సురక్షితంగానా? ఏం చెబుతున్నావు నువ్వు? నువ్వు నాకన్నా సురక్షితంగా ఉన్నావా?, నా వేళ్ళు ఎంత లోతుకు పాతుకుపోయి వున్నాయో తెలుసా? నేను ఆకాశంలోకి ఎంత ఠీవిగా నిలబడి వుంటానో తెలుసా? ఇద్దరు మనుషులు నా చుట్టూ చేతులు కలిపినా సరిపోరు తెలుసా? నన్ను ఎవరు భూమిలోనుంచి పీకేయగలరు? నా తల వంచే దమ్ము ఎవరికుంది?' అని కోపంగా మొహం తిప్పేసుకుంది.

కొంత కాలానికి అది తన మాటలకి పశ్చాత్తాప పడే సమయం వచ్చింది. ఒకరోజు సాయంత్రం ఆ ప్రాంతంలో పెద్ద తుఫాను వచ్చింది. అడవిలోని చెట్లన్నీ వేళ్ళతో సహా పెకలించబడ్డాయి. తుఫాను తాకిడికి మహావృక్షం కూడా వేళ్ళతో సహా పెకలించబడి దూరంగా పడిపోయింది. తుఫాను ఆగిన తర్వాత ఊరివారంతా జరిగిన నష్టాన్ని బేరీజు వేసుకుంటూ వుండగా ఒకప్పుడు చూస్తే ఆకాశాన్నే తాకుతుందా అన్నట్టుండే మహావృక్షం ఇప్పుడు చిన్న చిన్న మొక్కలకన్నా అధ్వాన్నంగా పడివుంది. అడవంతా చెక్క ముక్కలతో నిండిపోయింది. దీనికి ఒక్కటే మినహాయింపు వుంది. అదే చిన్న మొక్క... అది తుఫాను గాలికి అటూ ఇటూ వంగిపోయింది కాని తుఫాను తగ్గగానే మళ్ళీ నిటారుగా నిల్చుంది.

బలమైన శత్రువును ఎదుర్కొనేటప్పుడు దానిని గెలవటం కోసం వంగిపోయి, ఓటమిని ఒప్పుకోవటం చిన్నతనమా లేక తెలివైన పనా?

ప్రభుత్వం అండతో పెద్ద పెద్ద కార్పోరేషన్లు ఆదివాసీలు, చిన్న సమూహాల నివాస ప్రాంతాలను గనులకని, ఇతర సదుపాయాలకని ఆక్రమించుకుంటున్నప్పుడు వాళ్ళల్లో అలజడి ప్రారంభమైంది. హెచ్చు పెట్టుబడులతో వ్యాపారం చేసే ఈ సంస్థలు పర్యావరణానికి చేసే హానిని చిన్న స్థాయిలో జ్ఞానాన్ని కాపాడేవారు, సంప్రదాయ వాదులు నిస్సహాయంగా చూస్తూ ఉండిపోవటంకన్నా ఏమీ చేయలేని పరిస్థితిలో వున్నారు. కానీ, ఎప్పటికైనా కలిసి వుంటే చిన్న సమూహాలదే విజయమని నమ్మడం ఆదర్శధామం (యుటోపియా) కలలు కావచ్చు కానీ ఎప్పుడైతే మిగతా సమాజం సాంఘిక, ప్రాకృతిక అవసరాలను గుర్తించదో, అప్పుడు బంగారు భవిష్యత్తుకై ఆదర్శధామం కలలు కనడానికి లైసెన్స్ కావాలా?

– హనీబీ 20 (4) & 21(1) – 2010

Vol-8, Issue - 3 March - April 2020

## విషయ సూచిక

# పల్లెసృజన

సంపుటి-8 సంచిక-3 మార్చి-ఏప్రిల్ 2020

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org
Visit at :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం.**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్.**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త,**
**పి. చంద్రకాంత్ శర్మ,**
**బొల్లమూరి దుర్గాప్రసాద్,**
**జమ్మలమడక శ్రీకర్.**

కార్టూన్స్ : **వెంకట్**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్,** హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail :
narendragrafixhyd@gmail.com

**Rs. 1,000/-**
**for 5 years Subscription**



3 గ్రామీణ రవాణాకై ఇన్నోవేషన్లు



7 10వ ద్వైవార్షిక పోటీ విజేతలు



12 కనిపించని శత్రువు 'కరోనా'తో పల్లెసృజన ఇన్నోవేటర్ల పోరాటం



18 గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు



22 అన్ని పంటల పెరుగుదల, ఎదుగుదలకు సేంద్రియ ద్రావణం

23 సెల్ ఫోన్ ద్వారా పశు వైద్యం డా. బలరాం సాహు




24 డా. ఎపిజె అబ్దుల్ కలాం 'ఇగ్నైట్-2019' పోటీ విజేతలు



27 'గొర్రె అశోక్ జడిగం'

30 ఆచారాలు, పండగలు, సాంప్రదాయాలు



32 స్పందన

వెనుక కవర్ పేజీ... [illegible]

మధ్య పేజీలో : **గత మాసాల్లో పల్లెసృజన పాల్గొన్న వివిధ ప్రదర్శనలు - కార్యక్రమాలు**

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-6-1055/2/4, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. -500094, Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

| | | |
|---|---|---|
| **Honey Bee (English)**<br>AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangpura, Ahmedabad - 380 009 Gujarat, India.<br>Phone: 91-79-27913792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org | **Kurshakan Samsarikkate (Malayalam)**<br>Fr Hubby Mathew<br>Peermade Development Society<br>Peermade, Idukki - 685531,<br>Kerala. hmathew@gmail.com | **Num Vali Velanmai (Tamil)**<br>Mr P Vivekanandan<br>45, T P M Nagar Virattipathu,<br>Madurai - 625010 Tamil Nadu<br>vivekseva@gmail.com |
| **Palle Srujana (Telugu)**<br>Brig Pogula Ganesham VSM (Retd)<br>102, Vayupuri, Sainikpuri Post<br>Secunderabad-500 094 Telangana.<br>president@pallesrujana.org, www.pallesrujana.org | **Loksarvani (Gujarati)**<br>SRISTI, P O Box No.15050<br>Ambawadi Ahmedabad - 380015 Gujarat<br>loksarvani@sristi.org | **Sujh-Bujh Aas Paas ki (Hindi)**<br>SRISTI, P O Box No.15050<br>Ambawadi Ahmedabad - 380015 Gujarat<br>loksarvani@sristi.org |

# గ్రామాల్లో వలస కార్మికుల పునరావాసం

కోవిడ్ మహమ్మారి సమాజంలోని అన్ని వర్గాలకు అనివార్యమైన, అత్యావశ్యకమైన, మనమంతా సౌకర్యవంతంగా మరచిపోయిన వలస శ్రామిక వర్గాన్ని మనముందు నిలిపింది వారి గురించి అన్ని వర్గాల వారిని ఆలోచింపజేస్తున్నది. పేదలతో పని చేయించుకోవడమే కాని, వారిని మనుషులుగా చూడటం మన పద్ధతిలో లేదు. ధనిక - పేద వర్గాలు, దొరలు-శ్రామికులు, స్వంతదార్లు - కౌలుదార్లు, శ్రమజీవులు, ఇంటామె, -పనామె ఇలా శ్రమజీవులను వర్గీకరించి పాత్రధారులుగానే చూస్తాము. కాని మనలాగా వారికి కుటుంబం, స్వగృహం, బాధ్యతలు, ప్రేమ, ఆప్యాయత, పిల్లలతో కాలం గడపటం, విహారాలకు వెళ్ళడం లాంటివి కూడా ఉంటాయని ఎప్పుడూ మనం ఆలోచించలేదు. ఇది మన సమాజంలో వున్న పెద్ద లోపం.

గ్రామీణుల్లో ఎక్కువమంది వలస శ్రామికులు. వీరు మనదేశంలో దాదాపు 10–13 కోట్ల వరకు ఉంటారు. ప్రతి రాష్ట్రం నుండి ఇతర రాష్ట్రాలకు జీవన వృత్తికై వలస పోతారు. తెలంగాణలో దాని విస్తృత్వం 'బతకపోయిండు' అనేవారు. ఈ వలసకు ముఖ్య కారణం తమ గ్రామాల్లో వీరికి సరిపడిన జీవన వృత్తి లేకపోవడం, లేదా తక్కువ ఆదాయం, ఉపాధి అవకాశాలు వారి ఆకాంక్షలకు సరిపోకపోవడం లాంటి కారణాల వల్ల స్వంత ఇంటిని, కుటుంబాలను, బాధ్యతలను, స్నేహితులను, పుట్టి పెరిగిన వాతావరణాన్ని వదిలి ఎక్కడికో వలస పోతారు. అందరికీ ఒకే ఆశ. మంచి జీవన వృత్తి దొరకాలి, ఆర్థికంగా ఎదగాలి, తమ కుటుంబాన్ని సుఖపెట్టాలి, ఊర్లో మంచి పేరు రావాలి. ఎన్ని త్యాగాలైనా, ఎంత కష్టమైనా, జీవన స్థాయి ఎంత తక్కువలో ఉన్నా ఆశలను పూర్తి చేసుకోవడానికి వలస దారి పడతారు శ్రామికులు. వీరు పేదలు అయినా వీరికి వ్యక్తిత్వం, ఆత్మాభిమానం ఉంటాయి ఉచితంగా ఇతరులని కోరుకోరు. శ్రమపడతారు, దానికి తగ్గట్టుగా ఫలం రావాలని ఆశిస్తారు. కడుపు కట్టుకుని, అతి తక్కువ ఖర్చు పెడతారు. కొంత మిగుల్చి, ఆ ధనాన్ని తమ కుటుంబాలకు పంపుతారు. సంవత్సరానికి ఒక్కసారైనా పెళ్లి, పండుగల్లో తమ స్వంత ఊరికి వెళ్ళి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. వీరి జీవితం చాలా ప్రయాసతో, త్యాగంతో కూడుకున్నది. ఇందులో శ్రమ, ఫలం తప్ప తమ ఆనందం, తమ సౌఖ్యం చాలా తక్కువ. కాని వీరి శ్రమ పట్టణాభివృద్ధికి, తద్వారా దేశాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుంది. వీరి శ్రమ అనివార్యం. ఈ సత్యం కోవిడ్ ద్వారా ప్రజలందరికి అవగతమవుతున్నది. వీరికి సరిపడిన ఆహారము కల్పించక ప్రభుత్వం వలస శ్రామికులను ఇంటికి వెళ్ళకుండా అడ్డగించటం, వారికి ఆర్థిక ప్యాకేజీలు, దినావసరాలు తీర్చడం. ఈ ప్రభుత్వ చర్య వెనక రియల్ ఎస్టేట్ రంగం పడే భయం. వలస శ్రామికులు లేకుండా వారి పనులు ముందుకు జరగవన్న సత్యం. వారు తమ గ్రామాలకు తిరుగు ముఖం పడితే అభివృద్ధి కార్యకలాపాలు ఏవీ జరగవన్న అవగాహన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అయోమయంలో పడేశాయి. అదృశ్య హస్తంతో, ఈ వలస శ్రామికులు పంటలను కోస్తారు, మనకు తిండి లభ్యమయ్యేట్లు చేస్తారు. రోడ్లు వేస్తారు, ఇళ్ళు కడతారు, వీరు అదృశ్యమైతే పట్టణాలు ఎలాంటి ఇబ్బందులకు గురవుతాయో, ఆర్థిక చక్రాలు ఎంత మందంగా తిరుగుతాయో ఊహించుకోవడం కష్టం కాదు.

శ్రమ అంటే ప్రకృతి నుండి ప్రజలకు కావాల్సింది చేయటం. అది చాలా ఉన్నతమైన కార్యం. ఇందులో శ్రమ ఉన్నంత మాత్రాన వారందరినీ మనం ఒక తక్కువ స్థాయిలో ఉంచి, వారిని మనుష్యులుగా గుర్తించడం మానేశాం. కోవిడ్ పరిస్థితుల్లో, లాక్‌డౌన్ ప్రారంభమైనప్పటినుండి, ప్రభుత్వం, రాజకీయ నాయకులు, కార్పోరేట్లు, కాంట్రాక్టర్లు వలస శ్రామికులను ఎలా ప్రవర్తించారో ప్రత్యేకించి చెప్పవలసిన అవసరం లేదు. వారి మనసు విరిగిపోయింది. ఒక్కసారిగా ఒక్క రాత్రిలో వాళ్ళందరినీ మనం నిరాకరించి, వారిని అనాథలుగా నిస్సహాయ స్థితిలో వదిలి పెట్టేశాం. వీరు తిరిగి రారు. వచ్చినా ఏ కొద్దిమంది మాత్రమే వస్తారు. కనీసం వచ్చే రెండు సంవత్సరాల వరకు వలస శ్రామికులు పట్టణ ముఖం పట్టడం సందేహం కాదేమో.

అయితే ఈ విపరీత, విషాదకర పరిస్థితిలో ఒక గొప్ప అవకాశం పల్లెసృజనకు కనబడుతుంది. తమతమ గ్రామానికి తిరిగి వచ్చిన ఈ శ్రామికులు గ్రామాల్లోనే ఏదైనా బతుకుతెరువు చూసుకోవడానికి ప్రయత్నం చేస్తారు. వారి ప్రతిభను, వారి ఆశయాలను, ఊరి అవసరాలను సంధానించి, గ్రామాలను దానివలన 'స్వయం సమృద్ధిగా' స్వావలంబన దిశగా నడిపించడానికి ఇదొక అద్భుత అవకాశం. తిరిగి వచ్చిన శ్రామికులు కొంతవరకైనా తమతమ గ్రామాల్లో ఉండిపోగలిగితే గ్రామ శక్తి పెరుగుతుంది. పట్టణాల్లో వారి సంఖ్య తగ్గితే అక్కడ మురికివాడల్లో వారి భారం తగ్గుతుంది. రెండు రకాలుగా ఉపయోగం సాధించే అవకాశమిదని 'పల్లెసృజన' దృఢంగా విశ్వసిస్తున్నది.

ఈ దిశగా ఇన్నోవేటర్లు, వాలంటీర్లు, పల్లెసృజన కార్యకర్తలు వచ్చే మూడు నెలల్లో పల్లెలు తిరిగి, తిరిగి వచ్చిన వలస శ్రామికులతో చర్చలు జరిపి, గ్రామాల అవసరాలను అవగాహన చేసుకొని, ఈ శ్రామికులకు జీవన వృత్తిని కల్పించే పథకాలు, అవకాశాలు, వారికి కావలసిన వనరులు, అవగాహనలు, స్థానిక ప్రభుత్వంతో సంధానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన గ్రామాభ్యుదయ కార్యక్రమాలతో అనుసంధానం ఇవన్నీ తయారు చేయాలన్న ఆలోచనలో ఉన్నాం. మీఅందరి సహకారాన్ని అపేక్షిస్తున్నాం.

ప్రస్తుత అసాధారణ పరిస్థితుల్లో మిమ్మల్ని కాపాడుకొని, అందరిని కాపాడాలని మనసారా కోరుతూ....

భవదీయుడు

బ్రిగేడియర్ పోగుల గణేశం (విశ్రాంత)



# ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలకు
# రవాణా సౌకర్యాలను సృష్టించిన గ్రామీణ ఇన్నోవేటర్లు



- జమ్మలమడక శశిమోహన్
- పల్లి వీరరాఘవ రెడ్డి

'గ్రామీణ రవాణా వ్యవస్థ' అనగానే ముందుగా గుర్తుకొచ్చేది "ఎడ్ల బండి". గ్రామాల్లో ఈ ఎడ్లబండే రైతుకు 'కారు, లారీ, ఆటో, ట్రాలీ, ట్రాక్టరు'. చిత్రకారులు వేసే గ్రామం చిత్రాల్లో ఎడ్లబండి లేకుండా చిత్రానికి పరిపూర్ణత్వం ఉండదు. అంతెందుకు ఎడ్లబండికి చెందిన ఏ పాటయినా, కథయినా, జ్ఞాపకమయినా అవి తప్పక 'మధుర స్మృతులే' అన్న విషయం ఏ వయసు మళ్ళిన రైతును అడిగినా చెబుతారు.

తెలుగు జానపద పాటల రచయితగా పేరుగాంచిన 'గోరటి వెంకన్న గారు' ఎడ్ల బండి ప్రాముఖ్యతను తన పాటలోని ఒక చరణం ద్వారా వివరించారు అది....

**"పల్లె కట్టుకొనె బతుకుల రాయిలో,**
**సెలకల చల్లే ఎరువు కుప్పతో**
**ఎడ్లబండి ఉన్నోని చేతిలో ఏడాదంతా పని దొరికేది**
**టాటా ట్రాక్టరు బుక్కపెట్టినాదో నా దొంక దారిని**
**నా ఎడ్లబండి గిర్రెగిరిపట్టినదెమ్మో నా పల్లెల్లోన"**

అంటూ ఎడ్లబండి రైతుకు ఏడాదంతా జీవనాధారంగా ఉండేది అన్నారు.

ఎడ్ల ఖరీదు సామాన్య రైతు కొనలేనిదిగా మారడం, ఎడ్లను కొన్నా వాటి పోషణ భారం విపరీతంగా పెరిగిపోవడం, పొలం పనులకే కూలీలు దొరికే పరిస్థితి లేని నేటి రోజుల్లో ఎడ్లను అటు పొలాన్ని చూసుకునే మనిషి కరువవటం.... పశువుల మేత లభించటం కష్టమవటం వల్ల ఎంతోమంది రైతులు ఎడ్ల పోషణ నుండి బయటకు వస్తున్నారు. పైపెచ్చు నాటికన్నా నేడు గ్రామీణ రవాణా వ్యవస్థలో చోటు చేసుకున్న ఎన్నో మార్పులు కూడా ప్రస్తుతం ఎడ్ల బండి ఉన్నా కూడా సరిపోని పరిస్థితులు ఏర్పడ్డాయి.

గ్రామీణ రవాణా వ్యవస్థలో ప్రధానమైనవి రైతు ఇంటినుండి పొలానికి ఎరువులు, విత్తనాలు చేరవేయటం, పొలం నుండి పండిన పంట దిగుబడులను ఇంటికి లేదా



కల్లాలకు చేరవేయటం, నూర్పిడి తర్వాత పంటను మార్కెట్‌కు తరలించడం, గ్రామానికి దూరంగా వున్న పొలాలకు రైతు కూలీలను చేరవేయడం లాంటివి అనునిత్యం ఎన్నో వున్నాయి. రవాణా అవసరాలు ఎక్కువయ్యాయి కానీ, రవాణా సాధనాలు గ్రామాల్లోకి ఎక్కువగా రాలేదు. ఆటోలు ప్రధానంగా మనుషుల రవాణాకే పనికి వస్తాయి. దీంతో గ్రామ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో గ్రామీణ రవాణా సౌకర్యం కొరకు అనేక ఆవిష్కరణలను గ్రామాల్లోనే తయారు చేస్తున్నారు. వాటి పని తీరు, లక్షణాలను గురించి మీకు తెలియజేసేందుకు 'పల్లెసృజన' అందిస్తున్న కొన్ని పరికరాలు.

**మోటార్ సైకిల్ ట్రాలీ :**

రవాణా వ్యవస్థ ఆధునీకరణ తర్వాత గ్రామాల్లో ఎక్కువ మంది రైతులకు మోటార్ సైకిల్ తప్పనిసరి అయిపోయి దాదాపు ప్రతి ఇంటికీ ఒక మోటార్ సైకిల్ వుంటోంది. దీనితో రవాణా సౌకర్యం కల్పించవచ్చన్న ఆలోచనతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఎంతోమంది రైతులు, తమ సృజనాత్మకతతో పునాది స్థాయి ఆవిష్కర్తలుగా మారి, ఆ మోటార్ సైకిల్‌కే ఒక ట్రాలీని తయారు చేసి విజయవంతంగా ఈ సమస్యకు ఒక అద్భుత పరిష్కారం కనుగొన్నారు. ఈ మోటార్ సైకిల్ ట్రాలీ తయారు చేసే వారిలో ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా చిలకలూరి పేట సమీపంలో 'కొండాలు' అనే ఆవిష్కర్త, తెలంగాణ లోని సిద్దిపేట జిల్లాకు చెందిన 'పరమేశ్వర్ రెడ్డి' అనే ఆవిష్కర్త ఆయా ప్రాంతాల్లో మోటార్ సైకిల్ ట్రాలీలను తయారు చేసి రైతాంగానికి అందిస్తూ, గ్రామీణ రవాణా వ్యవస్థకు తమవంతు తోడ్పాటును అందిస్తున్నారు. ఈ ట్రాలీలను మోటార్ సైకిల్‌కు తగిలించుకోవటం, విడదీయటానికి చాలా తక్కువ సమయం పడుతుంది. ఎంతో సులభం కూడా.


కొండాలు తయారు చేసిన ట్రాలీ


మల్లయ్య తయారు చేయించుకున్న మోటార్ సైకిల్ ట్రాలీ

ఈ మోటార్ సైకిల్ ట్రాలీ ద్వారా 3-4 క్వింటాళ్ళ బరువు గల ఎరువులు, పంట దిగుబడులను సునాయాసంగా ఇంటి నుండి పొలానికి, పొలం నుండి ఇంటికి లేదా కల్లాలకు రవాణా చేసుకోవచ్చు. కొన్నిచోట్ల కొందరు యువకులు దీని ద్వారా ఉపాధి కూడా పొందుతున్నారు. వీరికి మామూలుగా మోటార్ సైకిళ్ళు ఉంటాయి. వారు ఏ పనీ పాటు లేక ఖాళీగా తిరగకుండా, కుటుంబ ఆదాయం పెంచటం కోసం తమ మోటార్ సైకిల్‌కు ట్రాలీ ఏర్పాటు చేసుకుని కొందరు రైతు కూలీలను గ్రామం నుండి పొలానికి, పొలం నుండి గ్రామానికి తరలించడం, ఊరికి రహదారి దూరంగా వున్న గ్రామస్థులు రోడ్డు నుండి గ్రామానికి ప్రయాణీకులను, లగేజి చేరవేయడం లాంటిపనుల ద్వారా సంపాదించుకుని గ్రామీణులకు ఉపయోగ పడటం ద్వారా కాస్త మంచి పేరు, కొంత ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

పందిరి వ్యవసాయం చేసేవారు ఈ మోటార్ సైకిల్ ట్రాలీని వినియోగించుకోవటం ద్వారా పందిళ్లలో తెంపిన కూరగాయలను నేరుగా ట్రాలీలో వేసుకుని ఇంటికి లేదా మార్కెట్‌కు తరలించడంతో బరువులు మోయాల్సిన అవసరం తప్పుతోంది. పందిరి వ్యవసాయంలో పంటకు పురుగు మందులు పిచికారి చేయటానికి కూడా ఈ ట్రాలీ ఉపయోగ పడుతుంది. ట్రాలీలో నీటి డ్రమ్ము, స్ప్రేయర్‌ను ఏర్పాటు

చేసుకోవటం ద్వారా అలుపు లేకుండా పంటకు పురుగు మందు పిచికారి చేసుకోవచ్చు.

పండ్ల తోటల యజమానులకు ఈ మోటార్ సైకిల్ ట్రాలీ ఒక వరమే అని చెప్పవచ్చు. ఎందుకంటే పండ్లను తెంపి పొలంలో ఒకచోటికి చేర్చాలంటే తప్పక మనిషి మోయాల్సిన పరిస్థితి. అందుకు తగిన బలమున్న మనిషి లభ్యత కూడా కష్టమే. కాబట్టి ఈ ట్రాలీని ఉపయోగించుకోవటం ద్వారా నేరుగా చెట్టు వద్దకే మోటార్ సైకిల్‌ను తీసుకు వెళ్ళి ఆ చెట్టు పళ్ళను తెంపి ట్రాలీలో వేసుకోవటం ద్వారా ఈ బరువుమోసే పని తప్పుతుంది.

నాగర్ కర్నూలు జిల్లాకు చెందిన మల్లయ్య అనే రైతు, విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ ఈ సమస్యకు పరిష్కారంగా తన మోటార్ సైకిల్‌కు ట్రాలీ ఏర్పాటు చేసుకుని, తన పొలం నుండి ప్రత్తిని ఇంటికి చేరవేయటానికి వినియోగించుకున్నారు. అలాగే నిజామాబాద్ జిల్లాకు చెందిన 'భాస్కర రెడ్డి' అనే రైతు తన మోటార్ సైకిల్‌కే ఒక ట్రాలీ తయారు చేయించుకుని, అందులో తన పొలానికి కూలీలను తరలించడమే కాదు, పొలానికి అవసరమైన ఎరువులు చేరవేయడం, పొలం నుండి వ్యవసాయ దిగుబడులను ఇంటికి చేరవేయటం లాంటి పనులన్నీ ఈ ట్రాలీతోనే చేసుకుంటున్నారు.

ఈ ట్రాలీ కేవలం రైతులకే కాదు, చిన్న చిన్న వ్యాపారస్తులు గ్రామాల్లో వ్యాపారం చేసుకుంటుంటే, మరికొందరు గృహ నిర్మాణానికి సంబంధించిన ఇటుకలు, ఇసుక, కంకర లాంటి రవాణాకు కూడా వాడుకుంటున్నారు.

ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే.... ప్రస్తుతం దాదాపు ప్రతి ఒక్కరికీ మోటార్ సైకిల్ వుంది. దానికి అనుసంధానం చేసేదే ఈ ట్రాలీ. కాబట్టి ట్రాలీతో అవసరం


రైతు భాస్కర రెడ్డి తయారు చేయించుకున్న ట్రాలీ


చిన్నపాటి ట్రాక్టరుకు ఏర్పాటు చేసుకున్న ట్రాలీ

లేదు అనుకున్నపుడు దాన్ని విడదీసి మోటార్ సైకిల్‌ను తమ అవసరాలకు వినియోగించుకోవచ్చు.

**మినీ టిల్లర్‌కు ట్రాలీ ఏర్పాటు :**

గుంటూరు జిల్లాకు చెందిన అశోక్ అనే ఇన్నోవేటర్ తాను తయారు చేసిన మినీ టిల్లర్‌కు ట్రాలీని ఏర్పాటు చేయటం ద్వారా దాన్ని ఇంటినుండి పొలానికి తీసుకు వెళ్ళటం సులభం చేశాడు, కానీ అది రైతు రవాణాకు కూడా ఎంతగానో ఉపయోగ పడుతూ చాలా వరకు రైతుల రవాణా ఖర్చులు, అవస్థలను కూడా తీరుస్తోందని అతను ఎంతో ఆనందం వ్యక్తం చేశాడు. ఈ ట్రాలీలో కూడా రైతుకు అవసరమైన ఎరువులు, కూలీలు, పంట దిగుబడులను ఎంతో సులభంగా రవాణా చేసుకోవచ్చు. సన్న, చిన్నకారు రైతులకు ఇది ఎద్దులబండితో సమానమే. ఒక్కోసారి పొలంలో రెండు మూడు వ్యవసాయ పనిముట్లతో సేద్యం చేయాల్సి వుంటుంది. ఉదాహరణకు గొర్రు, గుంటక, బోదెలు ఒకేరోజు చేసుకుని రావాల్సి వుంటుంది. అటువంటప్పుడు ట్రాలీలో అన్ని పరికరాలను తీసుకు వెళ్ళి ఒకదాని తర్వాత ఒక పని చేసుకుని సాయంత్రం ఆనందంగా ఇంటికి తిరిగి వస్తాడు రైతు.

4 హార్స్‌పవర్ శక్తిగల డీజిల్ ఇంజన్‌తో తయారైన యంత్రం కాబట్టి ఈ ట్రాలీలో 60 లీటర్ల నీటి డ్రమ్ములు ఏర్పాటు చేసుకుని అన్ని సైజ్‌లతో పాటు, పందిరి వ్యవసాయంలో, ఉద్యాన తోటలకు తక్కువ ఖర్చుతో, ఎక్కువ శ్రమ లేకుండా పురుగు మందులను పిచికారి చేసుకోవచ్చు.

**ట్రాలీతో కూడిన చిన్న ట్రాక్టరు :**

5 నుండి ఏడున్నర అశ్వ శక్తిగల డీజిల్ ఇంజన్‌తో అతి చిన్న ట్రాక్టర్లను తయారు చేశారు ఇన్నోవేటర్లు. ఈ ట్రాక్టరు ట్రాలీతో రైతు తన వ్యవసాయ బరువులను తోలుకుంటుంటే చూసిన వారు ఇది ఎద్దుల బండికి ఏమాత్రం

తీసిపోదు అని తేలాయనిద్చారు. అంతగా వ్యవసాయ పనులకు ఉపయోగ పడుతోంది ఈ చిన్న ట్రాక్టరు ట్రాలీ. దీని ద్వారా దాదాపు 8 నుండి 10 క్వింటాళ్ళ వరకు బరువును సునాయాసంగా లాగించవచ్చు. సూర్యాపేట జిల్లాకు చెందిన సైదారావు తయారు చేసిన చిన్న ట్రాక్టరుతో సంధానం చేసిన ట్రాలీ 8 క్వింటాళ్ళ బరువు సునాయాసంగా లాగుతుంది. ఈ ట్రాలీలో సేద్యానికి కావలసిన అన్ని రకాల పరికరాలు బిగించి అన్ని పొలం పనులను సైదారావు కూలీల అవసరం లేకుండా పూర్తి చేసుకున్నారు.

**పవర్ టిల్లర్‌ను ట్రాక్టర్‌గా మార్చి, దానికి ట్రాక్టర్ ట్రాలీ :**

14.5 హార్స్‌పవర్‌ల పవర్ టిల్లర్‌ను నాలుగు చక్రాల ట్రాక్టరుగా రూపాంతరం చేశారు ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా లోని ఇంకొల్లు గ్రామానికి చెందిన బుజేసాబ్ అనే ఇన్నోవేటర్. ఇందులో హైడ్రాలిక్ వ్యవస్థ కూడా ఉండటం ఓ ప్రత్యేకత. దీనికి ఏర్పాటు చేసిన ట్రాలీ ద్వారా ఎద్దుల బండి ద్వారా లాగించే బరువులన్నీ సునాయాసంగా లాగించుకోవచ్చు. ఈ ట్రాలీలో పది నుండి పదిహేను మంది కూలీలను పొలానికి తరలించవచ్చు. ఉద్యాన తోటలు, పందిరి వ్యవసాయాలలో పంట దిగుబడులను చెట్ల నుండి నేరుగా మార్కెట్ వరకు తరలించే సదుపాయం వుండటం వల్ల ఎంతో శ్రమ, కూలీల ఖర్చు మిగిలిపోతుంది.

హైడ్రాలిక్ వ్యవస్థ కూడా ఈ ట్రాక్టరులో ఏర్పాటు చేయటం వల్ల పంటలకు, ఉద్యాన తోటలు, పందిరి వ్యవసాయాల్లో పురుగు మందు పిచికారి ఎంతో సమర్థ వంతంగా చేసుకోవచ్చు. పురుగు మందు పిచికారికి మిగతా వాటిలాగా ప్రత్యేకంగా మోటారు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం లేదు. పంట పూర్తయిన తర్వాత పశువుల మేతలను కళ్ళాలకు సునాయాసంగా తోలుకోవచ్చు. దీంతో ఓ సామాన్య



సైదారావు 5 అశ్వశక్తి గల ట్రాక్టరు



బుజేసాబ్ 14.5 హెచ్.పి. ట్రాక్టరు ట్రాలీ

రైతు పొలం పనులన్నింటితో పాటు, రవాణాకు సంబంధించిన పనులను కూడా చేసుకోవచ్చు.

గ్రామాల్లోని ప్రజలకు రవాణా అవసరాలు ఎన్నో ఉంటాయి. ప్రయాణాలప్పుడు ఇంట్లోని సామాన్లు బస్టాండు వరకు తీసుకొని వెళ్ళాలన్నా, వ్యవసాయ అవసరాలకైనా, పండ్లు, కూరగాయల రవాణా లాంటి నిత్య అవసరాలను తీర్చటానికి గ్రామస్థులు నూతన ఆవిష్కరణలు తమ అవసరానికి తగినట్లుగా చేసుకుంటున్నందుకు 'పల్లెసృజన' హర్షం వ్యక్తం చేస్తున్నది.

ఇక్కడ రైతాంగం గుర్తించాల్సిన ముఖ్యమైన అంశం ఒకటుంది. ఈ గ్రామీణ రవాణాకు సంబంధించిన ఏ వాహనాలకు ఇప్పటి వరకు ఆర్.టి.ఎ. శాఖ అనుమతి లేదు కాబట్టి రాష్ట్రీయ, జాతీయ రహదారులపై తిరిగే అర్హత లేదు. అలా తిరిగితే ఆ శాఖ అధికారులు పెట్టే ఇబ్బందులకు గురి కావాల్సి వుంటుంది. ఒకవేళ తనిఖీ చేసే అధికారి రైతు కుటుంబానికి చెందిన వాడైతే పరిస్థితిని అర్థం చేసుకుని, మీ ఊళ్లో, పొలాల్లో తిప్పుకో కాని, ఇలా రోడ్లపైకి రావద్దు అని హెచ్చరించి పంపుతారు. కాబట్టి రైతులు వీలైనంత వరకు ఈ వాహనాలను మీ గ్రామాల్లో, పొలాల్లో మాత్రమే వినియోగిం చుకోమని మనవి.

కాబట్టి ఈ వాహనాలను పట్టణాలలో తిప్పటానికి ప్రయత్నించకండి. మీ ఊళ్లో, పొలం పనుల కోసం వినియోగించుకోండి. త్వరలోనే రవాణా శాఖ వారు కూడా ఇటువంటి వాహనాలకు అనుమతి ఇస్తారని ఆశిద్దాం.

ఈ దిశలో 'పల్లెసృజన' తప్పక కృషి చేస్తుంది.

**ఈ ట్రాలీల వివరాలకు సంప్రదించండి :**

**వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904**

**సుభాష్ చందర్, ఫోన్ : 96528 01700**

# 10వ జాతీయ ద్వైవార్షిక పోటీ విజేతలు




**'జీవన సాఫల్య పురస్కారం'**
**అభివృద్ధి చేసిన అధిక దిగుబడినిచ్చే 'కుదరత్' విత్తనాలు**



పేరు :ప్రకాశ్ సింగ్ రఘువంశీ.
నివాసం : **ఉత్తరప్రదేశ్.**

ఉత్తర ప్రదేశ్, వారణాసికి చెందిన 60 సంవత్సరాల ప్రకాశ్ సింగ్ రఘువంశీ ఒక చిన్న రైతు. అతను తనకున్న మూడున్నర ఎకరాల పొలంలో గోధుమలు, వరి, కందులు మొదలైనవి పండిస్తుండేవాడు. అతను నివసించే గ్రామ పరిసరాలలో రైతులు తాము స్వయంగా విత్తనాలను అభివృద్ధి చేసుకోవటం, అధిక దిగుబడులను సాధించడం అన్న ఆలోచనలు లేకుండా ఖరీదైన సంకరజాతి విత్తనాలను మాత్రమే మార్కెట్లో కొని తెచ్చుకుని వాడటం అలవాటుగా ఉండేది. స్వతహాగా అభ్యుదయ భావాలుగల ప్రకాశ్ సింగ్‌కి ఇది నచ్చలేదు. ఏదైనా కొత్తది చేసి మేలైన, అధిక దిగుబడినిచ్చే విత్తనాలు తయారు చేయాలన్నది అతని సంకల్పం. అనుకొన్నదే తడవుగా 1995లో తన ప్రయత్నానికి శ్రీకారం చుట్టి వరి, గోధుమ, కందులు, ఆవాల తో ప్రయోగాలు చేసి మంచి, మేలైన రకాలని రూపొందించటం ప్రారంభించాడు. ప్రారంభంలో ఫలితాలు అనుకున్నంత ఆశాజనకంగా లేకపోయినా, పట్టుదలతో తాను ప్రయోగాలు చేస్తూనే వున్నాడు. క్రమంగా మేలైన రకాల విత్తనాలు తయారు చేశాడు. ఆయన రూపొందించిన అధిక దిగుబడినిచ్చే విత్తనాలను తన ప్రయోగంలో భాగంగా "బీజ్‌దాన్ - మహాదాన్" అనే కార్యక్రమం క్రింద అవసరమైన రైతులకి ఉచితంగా విత్తనాలు అందించటం ప్రారంభించాడు. అతని వద్దనుండి విత్తనాలు తీసుకొన్న రైతులు వాటిని వాడి, చాలామంది మంచి ఫలితాలు వస్తున్నాయని చెప్పటం, ఇంకొంత మంది ఇంకేమైనా చేస్తే బావుంటుందని సలహాలు ఇవ్వటంతో అవన్నీ దృష్టిలో పెట్టుకొని 'కుదరత్-5' అనే వరి రకాన్ని రూపొందించాడు. అలా కుదరత్ పేరునే తాను తదుపరి రూపొందించిన అన్ని విత్తనాలకి వాడుకొన్నాడు.

ప్రకాశ్ సింగ్ కేవలం వరి మాత్రమే కాక మేలైన

గోధుమ, ఆవాలు, కందుల విత్తనాలు కూడా రూపొందించారు. అవన్నీ కూడా చాలా రకాల చీడ పీడలను తట్టుకునే శక్తి ఉన్నవే కాక, మంచి రంగు, రుచి, వాసన కలిసి ఉండి అధిక దిగుబడిని కూడా ఇస్తాయి. ఈ రకాలన్నీ కూడా ఈయన మేలైన లక్షణాలున్న వాటి నుండి, ఎంపిక పద్ధతిని ఉపయోగించి కొన్ని సంవత్సరాల పాటు ప్రయోగాలు చేసి, మంచి రకాలుగా రూపొందించినవే. ఇవే కాక ఇతను 100 రకాల వరి, గోధుమ, ఆవాలు, కందులు, పెసలు, ఆనప మొదలైన విత్తనాలు సేకరించి పరిరక్షించే కార్యక్రమం కూడా చేస్తుంటారు. దీనికిగాను ఈయనకి ఎన్.ఐ.ఎఫ్. వారు 2007వ సంవత్సరంలో జాతీయ స్థాయి పురస్కారంతో సత్కరించారు. అంతేకాక పిపివిఎఫ్ఆర్ఏ వారు 2010-11 సంవత్సరంలో ఇతన్ని మొక్కల జన్యు రక్షకునిగా గుర్తించి ప్రత్యేక బహుమానం అందజేశారు. ఇంతే కాక ఈయనకి ప్రాంతీయ, రాష్ట్రీయ, జాతీయ స్థాయిలో అనేక అభినందనలు, సత్కారాలు అందాయి. ఎన్.ఐ.ఎఫ్. ఈయనకి వ్యాపార రీత్యా, సాంకేతికంగా కూడా ముందుకెళ్ళటానికి తనవంతు సహాయ సహకారాలు అందించింది. ఆరతి సీడ్స్ & రీసర్చ్ అగ్రిటెక్



కంపెనీ వారు మూడు 'కుద్రత్' రకాల విత్తనాలని మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ మరియు కర్నాటక రాష్ట్రాలలో ఉత్పత్తి చేసి, అమ్మకాలు జరగటానికి సహాయ సహకారాలు అందిస్తున్నది.

ఈయన రూపొందించిన అనేక రకాల విత్తనాలు పదిహేను రాష్ట్రాలలోని రైతులు వాడి మంచి ఫలితాలు వస్తున్నాయని, తాము ఆర్థికంగా కూడా ఎంతో బాగుపడ్డామని చెప్పారు. వరి రకాలైన కుద్రత్-5, కుద్రత్-1, కుద్రత్-9, కుద్రత్-17, గోధుమలలో కుద్రత్-3, కందులు, కుద్రత్ గీత అనే ఆవాల రకాలు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, హర్యానా, పంజాబ్, ఉత్తరాఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, జార్ఖండ్ మొదలైన రాష్ట్రాల్లో అఖండ విజయం సాధిస్తూ రైతులకి కనక వర్షం కురిపిస్తున్నాయి. ఇంతవరకు దేశ వ్యాప్తంగా లక్షమందికి పైగా రైతులు ప్రకాశ్ సింగ్ రఘువంశ్ రూపొందించిన మేలు రకాలైన విత్తనాలు వాడి ఎంతో లాభం పొందారు. దీని కారణంగా ఈయనకి 2019 సంవత్సరానికి గాను ఎన్.ఐ.ఎఫ్. వారు 10వ జాతీయ స్థాయి ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో అత్యున్నత 'జీవన సాఫల్య పురస్కారం'తో సత్కరించి, గౌరవించారు.

**జాతీయ ప్రథమ బహుమతి**
**ట్రాక్టర్‌కి అనుసంధాన వరి నాటే యంత్రం**

వర్గం : వ్యవసాయ యంత్రాలు
ఇన్నోవేటర్లు : 1. ధ్యాన్‌వీర్ సింగ్, 2. వేద ప్రకాశ్
చిరునామా : పల్వల్, హర్యానా.



పుత్రికతో ఉత్తర ప్రదేశ్ వాసులైన ధ్యాన్‌వీర్ సింగ్ (45 సంవత్సరాలు), వేద ప్రకాశ్ (48 సంవత్సరాలు)

రైతులైనప్పటికీ వారికి యంత్రాలను తయారు చెయ్యటం, మరమ్మత్తులు చెయ్యటంలో కొంత పరిజ్ఞానం ఉంది. వేద ప్రకాశ్ కొంతకాలం వ్యవసాయం చేసి, తదనంతరం కొంతకాలం ఆభరణాలు తయారు చేసి, ఆ తరువాత మేకోళ్ళ ఉత్పత్తి చేసే పని చేశారు. జ్ఞానేందర్ ఇంటర్ మొదటి సంవత్సరం వరకు చదివి వదిలేశారు.

ఈ ఇద్దరు స్నేహితులకి ముందునుండి కూడా యంత్రాల ద్వారా మానవ శ్రమను తగ్గించాలన్న ఆలోచన ఉండేది. దీనికొరకు యెన్నో ప్రయత్నాలు చేసేవారు. ఊళ్ళలో వ్యవసాయ కార్యకలాపాలను గమనిస్తున్నప్పుడు, వీరికి వరి నాట్లు వెయ్యటంలో ఖర్చు, అవసరమైనప్పుడు కూలీలు దొరకక పోవటం, దొరికినా ఎక్కువ కూలీ రేట్లు అడగటం లాంటి రైతుల సమస్యలను గమనించారు. ఈ సమస్యకి పరిష్కారం కనుగొందామని ఈ ఇద్దరు నిర్ణయించుకొని కలిసికట్టుగా ఆలోచించి, ఎంతో శ్రమించి 2011లో తొలుత మోటారు సహాయంతో పని చేసే వరి నాటే యంత్రాన్ని రూపొందించారు. తరువాత దానినే మోటారు సహాయం లేకుండా ట్రాక్టర్‌కి తగిలించి దాని శక్తితోనే పనిచేసేలా రూపాంతరం చేశారు.

వీరు తయారు చేసిన ఈ యంత్రం 40 హెచ్.పి. సామర్థ్యమున్న లేదా అంతకన్న ఎక్కువ శక్తిగల ట్రాక్టర్‌కి అనుసంధానం చెయ్యవచ్చు. దానిని 3 బోల్ట్లు బిగించాల్సి ఉంటుంది. దీనికి 9 వరుసలు ఒకేసారి నాటే ఏర్పాటు ఉంది. వరుసల మధ్య దూరాన్ని లేదా ఎంత లోతుకి నాటాలో కూడా మార్చుకోవటానికి వీలుండేలా దీనిని రూపొందించారు. నాటాల్సిన మొక్కలను గుత్తులుగా తొమ్మిది అరలలో (ట్రే)





ఉంచితే చాలు అదే తడవకొకసారి రెండు లేదా మూడు నారు మొక్కలను పైగాను ఒత్తి తీసుకుని భూమిలో నిర్దేశిత దూరంలో నాటుతుంది. మొలకలని ట్రేలో నుండి తీసుకుని, వాటిని నిటారుగా చేసి, భూమిలోనికి మనకి కావలసిన విధంగా 5 నుండి 8 సెంటీమీటర్ల లోతుకి నాటుతుంది.

ఇదంతా ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది. ఈ యంత్రం 93% ఖచ్చితత్వంతో, గంటకి ఎకరకు పైగా పొలంలో పని చేస్తుందని క్షేత్రస్థాయి పరీక్షలలో తేలింది. వరినారు నాటాలంటే గంటకి రెండున్నర లీటర్ల ఇంధనం ఖర్చవుతుంది. దీని ఖరీదు సుమారు ఒకటిన్నర లక్షల రూపాయలుండగా ఒక హెక్టారులో పని చెయ్యటానికి సుమారు రూ. 300 వరకు ఖర్చవుతుంది.

ఎన్.ఐ.ఎఫ్. వారి 10వ జాతీయ స్థాయి ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో జ్ఞానేందర్ సింగ్ మరియు వేద ప్రకాశ్ లకుమొదటి బహుమతితో సత్కరించటం జరిగింది.

**జాతీయ మొదటి బహుమతి**

**సందీప్ ప్యాక్ (మేలైన ఉల్లిపాయలు)**

వర్గం : మొక్కలు –సందీప్ ప్యాక్ (మేలైన ఉల్లిపాయలు)

ఇన్నోవేటర్ : సందీప్ విఠారామ్ గోలే

స్థలం : పూణే, మహారాష్ట్ర

మహారాష్ట్ర లోని పూణేకు చెందిన సందీప్ విఠారామ్ గోలే వాణిజ్య పంటలు వేసే రైతు. ఇతను ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యంత్రాలను వాడి ఉల్లిగడ్డ పంట వేస్తుంటారు. డిగ్రీ వరకు చదివిన సందీప్ ఉల్లి పంటకు సోకే 'పర్పుల్ బ్లాచ్' వ్యాధిని తట్టుకొని, లేత ఎర్ర రంగులో ఉండే, ఎక్కువ రోజులు

నిలువ వుండి అధిక దిగుబడినిచ్చే ఉల్లి రకాన్ని రూపొందించారు.





నాసిక్ ప్రాంతంలో సాధారణంగా స్థానికంగా వాడే 'ఫుర్సుంగి' రకానికి క్రమంగా పది సంవత్సరాలుగా ఎంపిక పద్ధతిపై ప్రయోగాలు చేస్తూ కొత్త రకాన్ని రూపొందించారు. ఈ పది సంవత్సరాలుగా తాను ప్రయోగించిన ఎంపిక పద్ధతిలో ముఖ్యంగా పెద్ద సైజు ఉండటం, మంచి నాణ్యత ఉండటం, రెండు పాయలు అతుక్కుని ఉండకుండా ఉండటం, చీడ పీడలను తట్టుకునే గుణం కలిగి ఉండటం లాంటి లక్షణాలకు ప్రాముఖ్యత ఇచ్చారు. ఈవిధంగా ప్రతి సంవత్సరం మంచి మంచి రకాలు ఎంపిక చేస్తూ చివరికి 2016లో తాను అనుకొన్న రకాన్ని స్థిరపరిచారు.

సందీప్ రూపొందించిన ఈ మేలైన ఉల్లి రకం త్వరగా పంట చేతికి వస్తుంది. పెద్ద ఆకులుండటం, రెండుగా చీలకుండా ఒకే ఉల్లి గుండ్రంగా ఉండటం, ఆకులు పెలుసుగా లేక మృదువుగా ఉండటం, ఒకే సైజు లో పెద్ద ఉల్లిపాయలు ఉండటం లాంటి లక్షణాలు ఉన్నాయి. అంతే కాక సాధారణ రకం కన్నా అధిక దిగుబడి అనగా హెక్టారుకి 42 నుంచి 45 టన్నుల ఉల్లిపాయలు పండుతాయి. మహారాష్ట్ర దపోలిలో వున్న డా. బాలాసాహెబ్ సావంత్ కొంకణ్ కృషి విద్యాపీఠ్ వారు తన పేర పెట్టుకొన్న 'సందీప్ ప్యాజ్' రకాన్ని పరీక్షించి, సాధారణ రకాల కన్నా ఈ రకం రంగు, బరువు, గడ్డలో ఉండే పొరల సంఖ్య అధికంగా ఉండటం, పొరలు మందంగా ఉండటం, గడ్డలు రెండుగా చీలి ఉండకపోవటం, పొట్టు త్వరగా రాలిపోకపోవటం, ఎక్కువ కాలం నిలువ ఉండటం లాంటి లక్షణాలు గల ఈ రకం ఎంతో మేలైనదని నిర్ధారించారు. ఇతర రకాలకన్నా ఈ సందీప్ ఉల్లి రకం చీడపీడలు ప్రత్యేకించి 'పర్పుల్ బ్లాచ్' అనే వ్యాధిని తట్టుకొని నిలబడటం, ఎక్కువ దిగుబడిని ఇవ్వటం కూడా గమనించి ఈవిధంగా నిర్ధారించటం జరిగింది.

ఎన్.ఐ.ఎఫ్. వారు ఈ సందీప్ రకం ఉల్లిని రాజస్థాన్, మహారాష్ట్రంలో అనేక మంది రైతులచేత క్షేత్రస్థాయి పరీక్షలు చేయించగా, వాడిన వారంతా దానికి మంచి రకం అని కితాబునివ్వటం జరిగింది. గత మూడు సంవత్సరాలలో మహారాష్ట్ర, గుజరాత్, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని రైతులకు సుమారు 750 కిలోల విత్తనాలు వితరణ చేయగా, వారు మంచి ఫలితాలు సాధించారు.

పిపివి ఎఫ్ఆర్ క్రింద ఈ సందీప్ ప్యాజ్ రకాన్ని సందీప్ పేరున రిజిస్టర్ చేయటానికి దరఖాస్తు చెయ్యటం జరిగింది. 2019లో ఎన్.ఐ.ఎఫ్. 10వ జాతీయ ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ పోటీలలో సందీప్ ప్యాజ్‌కి మొక్కల విభాగంలో జాతీయ మొదటి బహుమతి ప్రదానం చేసి సత్కరించారు. ●



వివరాలకు సంప్రదించండి :
సుభాష్ చందర్, ఫోన్ :
**96528 01700**

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

**స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.**

National Innovation Foundation-India



ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

## జాతీయ 12 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 12వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృత్తుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మారుమూల ప్రాంతాల్లో నివసించే వారు, పర్వతప్రాంత నివాసితులు, విద్యార్థులు, స్థానిక సమాజాలకు ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ ఉత్పాదనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రాలు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మన్నగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా సమూహాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తింప బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను** వివిధ వర్గాలలో ఇవ్వబడును. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్లకు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాకుండా ప్రోత్సాహక బహుమతి క్రింద రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెలికి వెలికి తీయటానికి తోడ్పడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎంట్రప్రెన్యూర్లకు/ ఫ్రంట్ మీడియా ఆర్గనైజేషన్లకు కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2021** లోగా మాకు చేరేలా పంపండి.

మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :

**National Innovation Foundation,**

C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721,
Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903, Email: campaign@nifindia.org, Website: www.nif.org.in

గమనిక : [illegible] http://www.nif.org.in/announcement [illegible] 040-27111888 [illegible]

# కనిపించని శత్రువు 'కరోనా'తో పల్లెసృజన ఇన్నోవేటర్ల పోరాటం



- [illegible] శశిమోహన్
- పల్లె [illegible] రెడ్డి

ముప్పారపు రాజా    అల్లాడి ప్రభాకర్

'కరోనా' వైరస్ ప్రస్తుతం ప్రపంచాన్ని వణికిస్తున్న కనిపించని శత్రువు. ఏ దేశమైనా కనపడే శత్రువుతో తమ శక్తి కొలది పోరాడవచ్చు, కాని ఇక్కడ శత్రువు కనిపించదు, ఎలా గెలవాలో తెలియదు, కానీ పోరాటం మాత్రం తప్పదు. ఇంత వరకు మందు లేని ఈ మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందిని కబళించి వేస్తోంది. ఈ పరంపరలో మన దేశాన్ని కబళించడానికి ఒకింత శ్రమ పడాల్సి వస్తోంది దానికి. అందుకు కారణం మన సంస్కృతి, సాంప్రదాయాలే అని ఇప్పుడు ప్రపంచానికి తెలిసి వచ్చింది.

ఈ పరంపరలో 'కరోనా' సోకకుండా వుండేందుకు తీసుకోవలసిన కొన్ని జాగ్రత్తల విషయంలో మన ఇన్నోవేటర్లు కొన్ని రకాల పరికరాలను తయారు చేసి రాష్ట్రానికి, తద్వారా దేశానికి 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు కూడా ఈ పోరాటంలో భాగస్వాములే అని నిరూపించారు. వీరు కరోనా నియంత్రణకు తయారు చేసిన కొన్ని ఇన్నోవేషన్లను గురించి తెలుసుకుందాం.

**అల్లాడి ప్రభాకర్**

'పల్లెసృజన' పత్రిక పాఠకులకు జగిత్యాల జిల్లా, మెట్‌పల్లికి చెందిన అల్లాడి ప్రభాకర్ సుపరిచితులు. గత 10 సంవత్సరాలుగా ఎన్నో ఇన్నోవేషన్‌లు చేస్తూ వస్తున్నారు. అందులో వృద్ధులకు రోగులకు సకల సౌకర్యాల మంచం, 360 డిగ్రీలు తిరిగే ఇంటి కూలర్, పురపాలక నగరాల్లో మురికి కాల్వల ద్వారా ఇంకుడు గుంతలు మొదలైనవి ఎన్నో వున్నాయి. పల్లెసృజన పత్రికలో ఇతని గురించి, ఈయన చేసిన ఇన్నోవేషన్‌ల గురించి చాలాసార్లు రాస్తూ వచ్చాము. అల్లాడి ప్రభాకర్‌కు ఎన్నో ప్రాంతీయ, రాష్ట్ర, జాతీయ స్థాయి బహుమతులు కూడా వచ్చాయి. అవసరానికి తగ్గట్లుగా, సమయానుకూలంగా ఎంతోమందికి ఉపయోగపడే విధంగా ఇన్నోవేషన్‌లను చెయ్యటం ఈయన ప్రత్యేకత. ఈయన చేసిన ఒక కొత్త ఇన్నోవేషన్ గురించిన వివరాలు తెలుసుకుందాం.

**పెడల్ సహాయంతో చెయ్యి కడుక్కునే పద్ధతి**

కరోన మహమ్మారి ప్రపంచాన్ని గడగడలాడిస్తోంది. దీనికి సరైన వాక్సిన్ కాని, మందు కానీ కనుగొనటానికి ప్రపంచంలోని శాస్త్రవేత్తలంతా పరుగులు పెడుతున్నారు.

ప్రపంచంలోని అన్ని దేశాల మాదిరిగానే భారత దేశంలో కూడా 'లాక్‌డౌన్' ప్రకటించారు. ఎవ్వరూ బైటకు రాకుండా, ఒకరినొకరు తాకకుండా, కనీసం ఒక గజం దూరంలో వుంటూ అనేక విషయాలతో పాటు తరచూ చేతులు సబ్బుతో లేదా శానిటైజర్‌తో కనీసం 20 సెకన్లపాటు కడుక్కోవాలని డాక్టర్లు సూచించారు.

ప్రజలు తిరిగే ప్రదేశాలైన మార్కెట్లు, బ్యాంకులు లాంటి ప్రదేశాల్లో ఇతరులతో సంపర్కం తప్పనిసరి అవుతోంది. ఇది కరోన వైరస్ వ్యాప్తికి దోహదపడే అవకాశం



కాలితో నొక్కడం వల్ల చేతులు శుభ్రం చేసుకుంటున్న సందర్భంలో

ఎక్కువ చేస్తుంది. ఇంట్లో వున్నప్పుడు తరచూ చేతులు కడుక్కోవటం సులభమే కానీ బైట ప్రదేశాల్లోకి వచ్చినప్పుడు అది అవసరమైనా సాధ్యం కాకపోవచ్చు. ఈ సమస్యని దృష్టిలో వుంచుకుని మన అల్లాడి ప్రభాకర్ ఫిబ్రవరి లోనే పరిశీలించి, అవగాహన చేసుకొని, తన వర్క్‌షాప్‌లో మార్చి మొదటి వారంలోనే పరిష్కారాన్ని తయారు చేశారు. చేతులు వాడకుండా, కాలి పెడల్‌తో పని చేసే చేతులు కడుక్కునే పరికరాలు 3 విధాలుగా తయారు చేశారు. ఈ మూడింటిలో కూడా కుళాయిని కానీ, శానిటైజర్ ఉండిన సీసాను కానీ చేతితో తాకవసరం లేకుండా వీటిని రూపొందించారు.

1. ఎత్తయిన ఒక స్టాండుపై ఏర్పరచిన నీటి సోలేటి ట్యాంకు క్రింద రెండు వైపులా రెండు వాష్ బేసిన్లు, ఒక శానిటైజర్ డిస్పెన్సర్ పరికరం ఉంటాయి. దానిని మార్కెట్ యార్డులలో, ఎలాంటి నీటి సదుపాయాలు లేని చోట ఉపయోగించుకోవచ్చు.
2. నీటి సదుపాయం వున్న పాఠశాలలు, బస్ స్టాండ్‌లలో ఉపయోగించుకోవడానికి వాటర్ ట్యాంకు స్థానంలో రెండు వాష్ బేసిన్‌లకు నీటి కనెక్షన్ ఇస్తే సరిపోతుంది.
3. నీటి సదుపాయం అస్సలు లేని ప్రదేశాల్లో కేవలం కాలితో నొక్కితే శానిటైజర్ వచ్చే సదుపాయం మాత్రమే చేసుకోవచ్చు.

ఈ పై పద్ధతులన్నింటిలోను చేతులు కాక కాలితో పెడల్ వాడితే చాలు.

అల్లాడి ప్రభాకర్ రూపొందించిన చేతులు కడుక్కొనే స్టాండ్ వైరస్‌ను నియంత్రించడానికి ఎంతగానో దోహద పడుతోంది. ఇది ఇప్పటికే కరీంనగర్ మునిసిపల్ కార్పోరేషన్ వారికి అమ్మకం జరిగింది. నీటి సదుపాయం ఉన్నచోట ఉదాహరణకి మంథని ఎస్‌బిఐ బ్యాంకు, లేనిచోట నీళ్ళ ట్యాంకు అమర్చి దానికి విరివిగా వాడుతున్నారు.

ఎంతోమంది స్థానిక రాజకీయ నాయకులు, పోలీసు అధికారులు, డాక్టర్లు, సామాన్య ప్రజలు అల్లాడి ప్రభాకర్ రూపొందించిన కాలి పెడల్ వాడి చేతులు శుభ్రం చేసుకునే పరికరాలు ఎంతో బాగున్నవని ఆయనని ప్రశంసిస్తున్నారు. సమయోచితంగా ప్రజలకి ఉపయోగపడే ఇన్నోవేషన్లు రూపొందించినందుకు అల్లాడి ప్రభాకర్‌ను అభినందిస్తోంది పల్లెసృజన.

**కరోనాను అరికట్టే శానిటైజేషన్ క్యాబిన్ :**

కరోనా (కోవిడ్-19) వైరస్ 23 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే చనిపోతుందన్న వైద్యులు సూచించిన అభిప్రాయాన్ని విన్న అల్లాడి ప్రభాకర్ తన ఆలోచనకు పదును పెట్టి ఒక 'శానిటైజేషన్ క్యాబిన్' లాంటి మార్గాన్ని తయారు చేశారు. ఈ గదిని మార్కెట్లు, షాపింగ్ మాల్స్, బస్టాండు, రైల్వే స్టేషన్లు మొదలైన జనసమ్మర్దం గల ప్రదేశాలలో ఉపయోగించడానికి అనువుగా వుంటుంది. ప్రతి వ్యక్తి గది గుండా ప్రవేశించి, బయటకు వచ్చే లోపల ఆ వ్యక్తిపైన 23 డిగ్రీల ఉష్ణోగ్రత ప్రసారమై అతని శరీరంపైన వున్న సూక్ష్మజీవి చనిపోతుంది, ఒకవేళ ఆ వేడిని తట్టుకుని బ్రతికినా, ఈ గదిలోనే ఏర్పాటు చేసిన 'సూక్ష్మ క్రిమి నశింపజేసే మందు ద్రావణం' ప్రవేశించిన మనిషిపై పిచికారి చేయటం వల్ల శరీరంపైన వున్న వైరస్



కరోనాను అరికట్టే శానిటైజేషన్ క్యాబిన్

మొత్తం పనిపోతుంది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు చేసిన ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేయబడింది.

ఈ విషయాన్ని జగిత్యాల జిల్లా కేంద్రం లోని వైద్య శాఖాధికారులు ఇది కరోనా నియంత్రణకు ఉపయోగ పడుతుందని ధృవీకరించడంతో స్థానిక ఆర్టీసీ బస్టాండులో, ఆసుపత్రులలో ఏర్పాటు చేయటం జరిగింది. ఇతర చోట్ల కూడా ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికారులు అల్లాడి ప్రభాకర్‌ను కోరడం జరిగింది. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) 'పల్లెసృజన' వారికి ఈ ఇన్నోవేషన్‌ను గురించి తెలిపింది. వారు దీన్ని పూర్తిగా స్వీకరించి, దేశమంతా ఇలాంటి పరికరాలను వ్యాప్తి చెయ్యడానికి నిర్ణయించి, ఇన్నోవేటర్‌కు సహాయ సహకారాలను అందించడానికి నిర్ణయించింది.

**ముప్పారపు రాజా :**

కరోనా కాలంలో ఇంట్లో ఖాళీగా ఉండటం ఇష్టం లేక కుళాయిని తాకకుండా చేతులు శుభ్రంగా కడుక్కునేలా ఒక పరికరాన్ని తయారు చేశారు ఇన్నోవేటర్ 'ముప్పారపు రాజా'. మొదట ఇన్‌ఫ్రారెడ్ (అతినీల రేఖలు) సెన్సార్‌తో ఒక డిజైన్‌ను రూపొందించారు. దాన్ని కరీంనగర్ జిల్లా కలెక్టర్, పురపాలక శాఖ కమీషనర్‌లకు చూపించారు. ఆ పరికరాన్ని చూసిన ఆ అధికారులు ఇతని సమయోచిత ఇన్నోవేషన్‌కు ముగ్ధులై మరునాడే ముప్పారపు రాజాకు ఫోన్ చేసి ఇలా సెన్సార్‌తో కాకుండా మెకానికల్‌గా పని చేసే పరికరాన్ని రూపొందించు అన్నారు.

వెంటనే స్థానిక వెల్డింగ్ షాపు వద్దకు వెళ్ళి కూర్చుని పని పూర్తి చేశారు. మామూలుగా మనం చేతితో కుళాయిని తిప్పిన వెంటనే నీళ్ళు వస్తాయి. సబ్బు చేతికి అద్దుకుని శుభ్రం చేసుకుంటాము. కానీ ప్రస్తుతం కరోనా తాకితే చాలు ఆ


వరంగల్ మున్సిపల్ కమీషనర్ గారికి అప్పగిస్తున్న రాజా ఇన్నోవేషన్


[illegible]

వస్తువుకు కూడా క్రిములు అంటుకుంటాయి అనటంతో అసలు కుళాయిని తాకకుండా కాలితో క్రింద వున్న ఒక పెడల్‌ను తొక్కడం ద్వారా సబ్బు ద్రావణం చేతిలో పడుతుంది, మరో పెడల్‌ను త్రొక్కడం ద్వారా నీరు వస్తుంది చేతిని శుభ్రంగా కడుక్కుని వెళ్ళవచ్చు.

అంటే సబ్బు ద్రావణం కలిగిన డబ్బాను, కుళాయిని చేతితో తాకకుండానే చేతులను శుభ్రం చేసుకుని కార్యాలయం లోకి వెళ్ళే ఏర్పాటు చేయటంతో అధికారులు, స్థానికులు అంతా ముప్పారపు రాజాను అభినందించారు. మహబూబాబాద్, వరంగల్, వరంగల్, ఖమ్మం జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇలాంటి 12 పరికరాలను రాజా ఏర్పాటు చేశారు. మరో పది పరికరాలకు ఆర్డర్లు ఇవ్వటం జరిగింది. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) రాజాకు ఆర్థిక సహాయం చెయ్యడానికి ముందుకు వచ్చింది. నాగపూర్ నుండి పెద్దమొత్తంలో సరఫరా కావాలన్న వారితో సంప్రదింపులు జరుగుతున్నాయి.

'పల్లెసృజన' ఇన్నోవేటర్ల కృషిని 'కోవిడ్-19'ని జయించటానికి వీరు పడే తపనను జాతీయ స్థాయిలో గుర్తింపుకై ప్రయత్నం చేస్తున్నది. ●

**ఇన్నోవేటర్ ముప్పారపు రాజా - 95028 55858**

**ఇన్నోవేటర్ అల్లాడి ప్రభాకర్ - 94400 37475**

# మన మల్లేశం ఇక "గౌరవ డాక్టర్ చింతకింది మల్లేశం"



'లక్ష్మీ ఆసు యంత్రం' సృష్టికర్త చింతకింది మల్లేశం 2017లో "పద్మశ్రీ" పురస్కారాన్ని అందుకొని జాతీయ స్థాయిలో 'పల్లెసృజన' వెలుగు కిరణంగా మారిన విషయం పాఠకులకు విదితమే. మల్లేశం ఇన్నోవేషన్ వల్ల జాతీయ, అంతర్జాతీయ స్థాయి గడించడం, అతను తయారు చేసిన ఇన్నోవేషన్ పోచంపల్లి చేనేత వ్యవస్థ రూపురేఖల్ని మార్చివేయడం గురించి తెలుసుకొన్న హైదరాబాద్ లోని 'గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం' వారు చింతకింది మల్లేశంను 15 నవంబర్, 2019న గౌరవ 'గౌరవ డాక్టరేట్' బిరుదును ప్రదానం చెయ్యటం జరిగింది.

ఒక రంగంలో విశేష సేవలు అందించిన వ్యక్తులకు విశ్వ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్ ప్రదానం చెయ్యటం మామూలుగా జరుగుతున్నదే. కానీ, పెద్దగా పై చదువులు చదువుకోని, గ్రామీణ స్థాయిలో (అ)సామాన్య ఇన్నోవేటర్ అయిన మన చింతకింది మల్లేశానికి ఈ గౌరవం దక్కటం గ్రామ స్థాయి ఇన్నోవేటర్లు అందరికీ స్ఫూర్తిదాయకం. ఈ సందర్భంలో 'పల్లెసృజన' గౌరవ డాక్టర్ చింతకింది మల్లేశంకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తోంది.

## నిమటోడ్స్ నివారణ 'మూలికా మందు' కు
# పేటెంటు పొందిన చంద్రశేఖర్



వేరుశనగ, జామ, నిమ్మ, మల్లె మరియు ఎన్నో రకాల పంటలకు సోకే 'నిమటోడ్స్' పురుగు నివారణకు ఇంతవరకు సరియైన మందు లేని సమయంలో 'మూలికా మందు' కనుగొని యావత్ రైతాంగానికి ఎంతో ఊరటనిచ్చారు శ్రీకాళహస్తికి చెందిన ఇన్నోవేటర్ 'గల్లా చంద్రశేఖర్'. ఇప్పటికే ఈ మందును వేలాది మంది రైతులు వినియోగించుకుని తమ పంటలను రక్షించుకుంటున్న విషయం పల్లెసృజన పాఠకులకు తెలిసిందే. ఈ మందుకు గాను భారత ప్రభుత్వం నుండి ఇప్పుడు పేటెంటు పొందడమైనది. అంటే ప్రభుత్వం కూడా ఈ మందు పనితనాన్ని ఒప్పుకున్నట్లే అని రైతులు గుర్తించ వలసిందిగా కోరుతున్నాము.

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

[illegible]



[illegible]



[illegible]



[illegible]

హైదరాబాద్ వచ్చినప్పుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి సంప్రదిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
77, రోడ్ నెం. 3, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959, సెల్ : 96528 01700.
గూగుల్ మ్యాప్‌లో 'పల్లెసృజన' అని వ్రాస్తే మార్గం మీకు చూపిస్తుంది

ప్రదర్శనలు

# గత మాసాల్లో పల్లెసృజన పాల్గొన్న వివిధ ప్రదర్శనలు - కార్యక్రమాలు



'పల్లెసృజన' ఆధ్వర్యాన
అచ్చంపేట లో మార్చి 8వ తేదీన
జరిగిన
స్థానిక మూలికా వైద్యుల
సమావేశానికి హాజరైన వైద్యులు



జనవరి 4వ తేదీన
పల్లెసృజన కార్యాలయంలో
టి.డి.యు., బెంగుళూరు,
తెలంగాణ బయో డైవర్సిటీ బోర్డు
ఆధ్వర్యంలో
'మూలికా వైద్యుల అవగాహన సదస్సు'లో
పాల్గొన్న సాంప్రదాయ వైద్యులు.




ఫిబ్రవరి 1న
ఐఐఐటి, బాసర లో
'పల్లెసృజన'
ఇన్నోవేషన్ల ప్రదర్శన



మార్చి 14న
'తెలంగాణ కిసాన్ సంఘ్'
సభ్యులు
'పల్లెసృజన' కార్యాలయంలో
ఒక్కరోజు వర్క్‌షాప్‌లో
పాల్గొన్నారు.



15 మార్చి, 2020 నాడు
పల్లెసృజనలో
సి.డి.ఆర్. టీంతో
"బొధంక-జ్ఞాన శోధ" లో
పాల్గొన్న వాలంటీర్లు



20-22 డిసెంబర్, 2019
తేదీలలో చిత్తూరు జిల్లాలో
పల్లెసృజన నిర్వహించిన
33 వ చిన్న శోధయాత్రలో
పాల్గొన్న యాత్రికులు



01 Feb - Display of Innovations at IIIT, Basra



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్.' వారి
'బిడ్ టు సీడ్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## వ్యవసాయ వ్యర్థాలను ఎరువుగా మార్చే యంత్రం

**సమస్య – పరిష్కారం :**

సేంద్రియ వ్యవసాయ విధానంలో 'కంపోస్టు' ఎరువుకున్న ప్రాధాన్యత మరి దేనికీ లేదు. వ్యవసాయ వ్యర్థాలు, ఆకుల్లోని చెత్తతో కంపోస్టు చేసుకోవచ్చు అని అందరికీ తెలుసు. కాకపోతే దానికి సాధారణంగా 3–4 నెలల సమయం పడుతుంది. ఈ కాల పరిమితిని తగ్గించే యంత్రాలు విదేశాల్లో మాత్రమే లభించేవి. కానీ 'ఉమ్మేద్ సింగ్ భోన్స్లే' అనే రాజస్థాన్‌కు చెందిన ఇన్నోవేటర్ ఈ ప్రక్రియని కేవలం 25 నుండి 40 రోజుల లోపలే చేసే పరికరాన్ని కనుగొన్నారు. అతను చెప్పినదాని ప్రకారం ఈ యంత్రం ద్వారా కంపోస్టు తయారు చేయటానికి టన్నుకు కేవలం 2 రూపాయలు ఖర్చవుతుంది.

**పరికరం :**

చెత్తను తిరగవేయటం యంత్రం సహాయంతో జరుగుతుంది. ఈ యంత్రాన్ని ట్రాక్టర్‌కు అనుసంధానం చేసుకోవచ్చు. యంత్రంలో భాగంగా ఒక రోటర్ షాఫ్ట్‌కు కొన్ని బ్లేడ్లు అమర్చబడి వుండి ఆ బ్లేడ్లు తిరుగుతూ చెత్తను ముక్కలు చేస్తూ, తడి కూడా అందజేస్తాయి. ఎండాకాలంలో 5 రోజులకోసారి, చలి కాలంలో 7 రోజులకోసారి చొప్పున 5–6 సార్లు చెత్త కుప్పపైకి ఈ యంత్రాన్ని తోలుకుంటూ వెళ్ళితే చాలు అదే చెత్తను కలిపి నీరు అందించటం వల్ల ఆ చెత్త కంపోస్టుగా తయారవుతుంది.

**సాంకేతిక వివరాలు :**

- 400 టన్నుల చెత్తను ఒక గంటలో కలియ గలుపుతుంది.
- గంటకు మూడున్నర నుండి 4 లీటర్ల డీజిల్ ఖర్చవుతుంది.
- 50 హెచ్‌పి ట్రాక్టర్‌కు దీన్ని అనుసంధానం చెయ్యవచ్చు.
- రోటర్ 16 అంగుళాల వ్యాసం, 9 అడుగుల పొడవు కలిగి వుండి, 9 బ్లేడ్లు అమర్చబడి వుంటాయి.
- క్రోమ్ స్టీల్‌తో తయారు చేయబడిన ప్రత్యేకమైన గేర్‌బాక్స్ సహాయంతో వేలకొద్ది టన్నుల వ్యవసాయ వ్యర్థాలను, గృహ వ్యర్థాలను కంపోస్టుగా తయారు చేసుకోవచ్చు.
- రోటర్‌ను క్రిందకు, పైకి కదపటానికి అనువుగా హైడ్రాలిక్ సహాయం కలదు.
- 2000 లీటర్ల సామర్థ్యమున్న నీటి ట్యాంకు అమర్చబడి వుంటుంది.





ముఖ్యాంశాలు :

❀ ఈ యంత్రం సహాయంతో 120 నుండి 150 రోజుల్లో తయారయ్యే కంపోస్టు 25–40 రోజుల్లోనే తయారు చేయవచ్చు.

❀ పేడ కంపోస్టుకన్నా ఈ వర్మి కంపోస్టులో పోషక విలువలు ఎక్కువ.

❀ ఈ పనంతా ఒకేవ్యక్తి చేసుకోవచ్చు.

❀ నిరుద్యోగులకు, ఎక్కువ కంపోస్టు అవసరమైన వారికి ఇది ఎంతో అనువైన యంత్రం.

❀ నలుగురు నిరుద్యోగులు ఈ యంత్రాలను పట్టణాల్లో ఏర్పాటు చేసుకుంటే వారికి ఉపాధి, రైతులకు తక్కువ ధరలో సేంద్రియ ఎరువు అందించటంతో పాటు, పట్టణాలను చెత్త దుర్గంధం నుండి కాపాడి ఆరోగ్యకరమైన వాతావరణం అందించవచ్చు.

పురస్కారాలు :

❀ ఇన్నోవేటర్ 'గుర్మెల్‌సింగ్ ధోన్సీ' కి ఎన్ఐఎఫ్ వారు 2012లో 'ఉత్తమ సాంప్రదాయ జ్ఞానం' బహుమతిని అందజేశారు.

## పాలు పితికే యంత్రం

సమస్య – పరిష్కారం :

డెయిరీ ఫారంలు, ఎక్కువ పాడిపశువులు వున్న వారికి పశువులనుండి పాలు పితకడం ప్రధాన సమస్య. నేర్పున్నైన కూలీలు లభించటం కూడా దుర్లభంగా మారుతోంది. పైగా చేత్తో పితకడం అన్నది ఆరోగ్యకరమైన పద్ధతి కాదు అన్న భావన ప్రబలుతోంది. పాలు పితకటానికి యంత్రాలున్నా, చాలా ఎక్కువ పెట్టుబడి కావాల్సి వస్తోంది. ఈ సమస్యకి పరిష్కారంగా కర్నాటకకు చెందిన 'రాఘవ గౌడ' తక్కువ ఖర్చులో పాలు పితికే యంత్రాన్ని తయారు చేశారు.

పరికరం :

ఇది చేతితో నడిచే విధంగా, యంత్ర సహాయంతో పని చేసే విధంగా రెండు రకాలుగా తయారు చేశారు. తక్కువ పాడి పశువులున్న వారు కూడా దీనిని కొనుగోలు చేసి ఉపయోగించుకోవచ్చు. దీన్ని ఉపయోగించటం చాలా సులభం. స్త్రీలు కూడా సులభంగా ఉపయోగించుకోవచ్చు.

సాంకేతిక వివరాలు :

❀ ఈ యంత్రం తయారీలో మేలురకపు స్టీలు ఉపయోగించబడినది.

❀ 18 కిలోల బరువున్న చేతితో నడిచే ఈ యంత్రం సహాయంతో ఒకసారి, ఒక పశువు నుండి పాలు పితకవచ్చు.

❀ సెమీ ఆటోమేటిక్‌లో కరెంటు లేదా బ్యాటరీతో పని చేసే యంత్రాలు కూడా అందుబాటులో వున్నాయి.

ముఖ్యాంశాలు :

❀ ఒక పశువుకు పాలు పితకటానికి కేవలం 4 నుండి 6 నిమిషాలు పడుతుంది.

❀ నిమిషానికి ఒకటిన్నర నుండి 2 లీటర్ల పాలు పితక వచ్చు.

❀ చేత్తో పాలు పితకడం వుండదు కనుక పూర్తిగా ఆరోగ్య ప్రదాయమైనది.

❀ పశువుకు ఎటువంటి హాని కాని, అసౌకర్యం కాని కలుగదు.

❀ ఎటువంటి ఖర్చు లేకుండా 8 నుండి 10 సంవత్సరాల వరకు పని చేస్తుంది.






పురస్కారాలు :

❀ 2005లో ఇన్నోవేటర్ రాఘవ గారకు ఈ యంత్రం కనిపెట్టినందుకు గాను ఎన్ఐఎఫ్ వారు నాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతులమీదుగా పురస్కారం అందించడ మైనది.

వివరాలకు సంప్రదించండి:

పల్లెసృజన, సుభాష్, ఫోన్: 9652801700

E mail: subhash4@gmail.com,
Phone: +91 79 26732456/ 2095, Fax : +91 79 26731903
E mail: bd@nifindia.org, web : www.nif.org.in

# 800 సంవత్సరాల పురాతన ఆయుర్వేద ఔషధం

## సర్వ జ్వర నివారిణి

కావలసిన పదార్థాలు :

❀ శొంఠి, పిప్పళ్లు, మిరియాలు - ఒక్కోటి 20 గ్రా.

❀ లవంగం, ఏలకులు, జాజికాయ, జాపత్రి, తులసి, దాల్చిన చెక్క - ఒక్కోటి 10 గ్రా.

పై దినుసులన్నీ మెత్తగా దంచి, పలుచటి వస్త్రంలో కాయిదం (జల్లి) పట్టి ఈ చూర్ణాన్ని తయారు చేసుకుని ఒక సీసాలో ఉంచుకోవాలి.

ఏ జ్వరానికైనా, ఒక చెంచా చూర్ణము, పావుసేరు నీళ్ళలో కలిపి 50 గ్రా. బెల్లంతో ఉడికించాలి. 4-5 సార్లు ఉడికిన తర్వాత దించి, వడపోసి త్రాగితే అన్ని రకాల జ్వరాలు మెల్లిగా తగ్గిపోవడం ప్రారంభమవుతుంది.

మూలం :
ఆరోగ్య శతక్
రచయిత : పూజ్యులు నాగరాజు గారు.
సంప్రదింపులకు :
శ్రీ సాధన్ భట్టాచార్య,
ఫోన్ : 96692 40122.

## కోవిడ్-19 రోగులపై ప్రయోగం

ఈ సర్వ జ్వర నివారిణిని శ్రీ భంవర్‌లాల్ దూగర్ ఆయుర్వేద విశ్వభారతి, సర్దార్ షహర్, రాజస్థాన్‌లో 102 మంది 'కోవిడ్-19' రోగులపై ప్రయోగించడం జరిగింది. తదుపరి బికనీర్ మెడికల్ కళాశాలలో జరిగిన పరీక్షల్లో వీరందరికి నెగటివ్ వచ్చింది.

ముఖ్యంగా ఈ చూర్ణం రోగుల్లో నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. దీని మూలంగా వైరస్ వారి శరీర అంగాలపై ప్రభావం చూపించలేక చనిపోతుందని వైద్యుల అభిప్రాయం.

ఈ రోగపోట్లపై సంప్రదించడానికి:
రోహిత్ డింగ్రా,
ఫోన్ : 99906 64041
యస్.బి.ఎల్.డి. ఆయుర్వేద విశ్వ భారతి,
సర్దార్ షహర్, రాజస్థాన్



# అన్ని పంటల పెరుగుదల, ఎదుగుదలకు సేంద్రియ ద్రావణం

ఇన్నోవేటర్ : సంగటోయిన వెంకట కృష్ణుడు, వెలుగోడు గ్రామం, కర్నూలు జిల్లా. ఫోన్ : 99857 58013

రైతులు విచక్షణా రహితంగా రసాయనిక ఎరువులను, క్రిమి సంహారక మందులను వాడటం వల్ల భూసారం తగ్గిపోయి, వాతావరణ కాలుష్యం పెరిగి, పర్యావరణ సమతుల్యత దెబ్బ తినడం, భూమిలో రైతుకు మేలు చేసే మిత్ర పురుగులు చనిపోయి, తెగుళ్ళు విజృంభించి, పెట్టుబడులు పెరిగి, దిగుబడులు తగ్గి రైతు విపరీతంగా నష్టపోవడం జరుగుతున్నది. క్రిమి సంహారక మందులను వాడటం వలన ఆహారం విషపూరితమై అనేక రకాలైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అందుకే వ్యవసాయ శాస్త్రవేత్తలు, పర్యావరణ పరిరక్షణ వేత్తలు సేంద్రియ ఎరువులను, క్రిమి సంహారాలను వాడాలని, రసాయన ఎరువులు, క్రిమి సంహారకాలను తగ్గించాలని సూచిస్తున్నారు. తులసి ఈ కోవకు చెందింది.

**తులసి :**

స్థానికంగా లభించే సహజ పదార్థాలతో తయారు చేయబడింది. దీన్ని ఏ పంటకైనా, పూలు, పండ్ల తోటలపైన కూడా వాడవచ్చు. ఈ ద్రావణాన్ని శిలీంద్రంగా (ఫంగిసైడ్) కూడా వాడవచ్చు. ఇది వేరు వ్యవస్థను దృఢం చేసి, పదార్థాలను గ్రహించే శక్తిని గ్రహించి, పోషకాల లోటును పూర్తి చేస్తుంది. చెట్లకు నిరోధక శక్తిని పెంచి, ఎక్కువ పిలకలు వచ్చేలా చేస్తుంది.

గత పది సంవత్సరాలలో రైతులు దాదాపు ఒక లక్ష ఎకరాల్లో 'తులసి' ద్రావణాన్ని ఉపయోగించారు.

చౌడు భూములలో మొక్కల పెరుగుదల సరిగ్గా వుండదు. ఎరువులు ఎంత మోతాదులో వేసినా, అది వేరుకు అందక మొక్క పెరుగుదల వుండదు. అటువంటి నేలల యందు 'తులసి' ద్రావణాన్ని పిచికారి చేసినట్లయితే భూమిలోని చౌడు విరిగి, మొక్క వేరుకు పోషకాలు సమృద్ధిగా అంది బాగా పెరిగి, మంచి దిగుబడి వస్తుంది. అధిక వర్షపాతం వున్నప్పుడు దెబ్బ పంటలయందు నీరు ఎక్కువ రోజులపాటు నిలువ వుండిన యెడల మొక్కల ఆకులు ఎరుపు రంగు వర్ణంలోకి మారి, ఆకులు రాలిపోతాయి. అలాగే పూత, పిందెలు, కాయలు కూడా రాలిపోతాయి. అలాంటప్పుడు 'తులసి' ద్రావణం పిచికారి చేసినట్లయితే కేవలం 5 రోజుల్లో కొత్త చిగుళ్ళు వచ్చి కొమ్మలు సాగి, కొత్త పూత వచ్చి, పిందెలు, కాయలు ఏర్పడతాయి. అలాగే ఎక్కువ రోజులు వర్షం లేకపోయినా దెబ్బ తగిలి పూత, పింది రాలిపోతుంది. అప్పుడు 'తులసి' ద్రావణం వాడితే బెట్టను (నీటి యెద్దడిని) తట్టుకొని మొక్కకు ఎలాంటి హాని జరగదు. వాతావరణంలో జరిగే హెచ్చు తగ్గులను సరిచేస్తూ, మొక్కలకు సంజీవనిలా పని చేస్తుంది.




ప్రత్తి, మిరప, టమోటా, వంకాయ ఇతర కూరగాయల పంటలపై వచ్చు ఆకు ముడత, కొమ్మ ఎండు, విల్ట్ ఫై బ్లాక్ వైరస్ బ్యాక్టీరియా లాంటి తెగుళ్ళను నివారిస్తుంది. మొక్క పెరుగుదలకు, ఎక్కువ కొమ్మలు వచ్చేటట్లు చేస్తుంది. నీటియెద్దడిని తట్టుకునేలా చేస్తుంది. ఎన్.పి.కె. ఎరువులను పూర్తిగా సద్వినియోగం చేస్తుంది. పూత, పింది, కాయల సంఖ్యను పెంచి రాలిపోకుండా చేస్తుంది. నాణ్యత గల రంగు, కాయల పరిమాణం పెరుగుతుంది.

**రైతుకు లాభాలు :**

'తులసి'ని ఎకరాకు ఒకసారి పిచికారి చేస్తే ఒక వెయ్యి రూపాయలు ఖర్చవుతుంది. అలాగే పంట మొత్తంమీద రెండుసార్లు పిచికారి చేయాల్సి వుంటుంది. అంటే ఎకరాకు మొత్తం ఖర్చు 2,000/- అవుతుంది. రసాయన మందులు ఉపయోగిస్తే ప్రతి ఎకరాకు రూ. 15 నుండి 20 వేల దాకా ఖర్చవుతుంది. ప్రతి రైతు 'తులసి' ద్రావణాన్ని ఉపయోగించడం వల్ల రసాయన మందు ఖర్చులో పది శాతం మాత్రమే ఖర్చు చేస్తారు.

- మిరప పంటలో తాలు కాయలు 5 శాతం మాత్రమే ఉంటాయి. అదే రసాయన పద్ధతిలో అయితే తాలు కాయలు 20 శాతం దాకా పండటం వలన రైతుకు నష్టం చేకూరుతుంది.
- పంట పెరుగుదల కనీసం 20% వచ్చినట్లు 'తులసి' ద్రావణాన్ని వాడిన రైతులు చెప్పారు.
- వరి ధాన్యం బరువుగా, ఆరోగ్యంగా ఉంటుంది. మిల్లులో బియ్యం పట్టినపుడు నూకలు మామూలు ధాన్యం కంటే 5-10 శాతం తక్కువగా ఉంటాయి అందువల్ల రైతుకు బస్తాకు దాదాపు రూ. 500/-ల దాకా లాభం చేకూరుతుందని రైతులు/ మిల్లు యజమానులు చెప్పారు.

**సమాజానికి లాభాలు :**

- అన్ని పంటలు ఆరోగ్యంగా, కొత్తకాంతితో, మంచి రంగుతో కళకళలాడుతూ ఉంటుంది.
- తులసి వాడి పండించిన పండ్లు, కూరగాయలు పంట కోసిన తర్వాత ఒక వారం రోజుల దాకా కుళ్ళిపోవు. రసాయనాలు వాడి పండించిన పండ్లు, కూరగాయలు 3-4 రోజులు మాత్రమే బాగుంటాయి.
- పొలంలోని మిత్ర పురుగులకు ఎలాంటి హాని కలుగదు.
- తులసి ద్రావణం తయారీకి అవసరమైన సహజ ముడి పదార్థాలు వెలుగోడు, దాని చుట్టుప్రక్కల గ్రామాల నుండే సరఫరా చేయబడతాయి కావున 'తులసి' అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంలో 30% ఈ గ్రామస్థులకే చేరుతుంది.

ఈ విధంగా 'తులసి' అమ్మకం వల్ల వాడిన రైతులు, వాతావరణం, ముడి సరుకులు సరఫరా చేసిన గ్రామస్థులకు లాభకరంగా ఉండటమే కాకుండా, ఆరోగ్యకరమైన ఆహారం, పండ్లు, కూరగాయలు సమాజానికి చేరడం వల్ల ప్రజలు ఆరోగ్యం మెరుగుపడి ఆనందంగా జీవిస్తారు.

'తులసి' సహజ ద్రావణం పంటల పెరుగుదలకు అద్భుతమైన ఉపాయం. రైతులు దీన్ని ప్రయోగం చేసి తాము కూడా లాభాలు ఆర్జిస్తారని, సమాజాన్ని ఆరోగ్యవంతంగా ఉంచడానికి తోడ్పడతారని 'పల్లెసృజన' ఆశిస్తున్నది. ●


**ఈ ద్రావణాల కొరకు సంప్రదించండి :**

**సుభాష్ చందర్ - 9652801700,**

**వెంకట కృష్ణుడు - 99857 58013**

## ఎన్.ఆర్.ఐ. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.ఐ. (నాన్ రెసిడెంట్ ఇండియన్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ ఉన్నవారై ఉంటారు. అటువంటి వారు తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలన్న తపన కలిగిన వారు కూడా ఉంటారు. అటువంటి వారు కేవలం రూ. 1,000/-లతో 5 సంవత్సరాల పాటు తమ గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటం, సంతృప్తి కలగటంతో పాటు, మరుగున పడిపోయిన ఎన్నో ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఆవిష్కరణలను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది.



గ్రామం నుండి వెలుపల జీవనం సాగిస్తున్న మీ మిత్రులకు ఈ విషయం తెలియజేయండి. వారు 'పల్లెసృజన' పత్రికకు చందా పంపి, ఈ పత్రిక వారి గ్రామాలకు వచ్చే ఏర్పాటు చేస్తారు. ఈ ప్రయత్నం వల్ల తెలుగు రాష్ట్రాలలోని అన్ని గ్రామాలకు త్వరలో 'పల్లెసృజన' చేరుతుందని ఆశిస్తున్నాము.

-ఎడిటర్

**పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపచేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ చందా పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.**

Pay by "Phone Pe" to 9866 00 1678

| పల్లెసృజన చందా | | |
|---|---|---|
| | సంవత్సరం | మూల్యం |
| | రెండు సంవత్సరాలకి | 400/- |
| | ఐదు సంవత్సరాలకి | 1,000/- |

[illegible]

[illegible] - 500 094. [illegible] 040-2711 [illegible], 9866 00 1678

E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

[illegible]

[illegible]

M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.

SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023

[illegible] 9866 00 1678 [illegible]

[illegible]

QR code for Phone Pe

Scan & Pay Using PhonePe App

## కోవిడ్ పరిస్థితుల్లో రైతులను ఆదుకుంటున్న ఒడిషా పశువైద్యులు

# డా. బలరాం సాహు



నాపేరు డా. బలరాం సాహు. నేను ఒరిస్సా రాష్ట్రం లోని భువనేశ్వర్‌లో పశు వైద్యునిగా వుంటూ 'హనీబీ నెట్ వర్క్'కి అధ్యక్ష సభ్యునిగా తోడ్పడుతూ వుంటాను. నేను మన 'హనీబీ' వారు గ్రంథస్థం చేసి వుంచిన లేదా సేకరించి వుంచిన పశు వైద్యానికి సంబంధించిన చికిత్సలను/ చిట్కాలను నాకు ఫోన్ ద్వారా సంప్రదించిన వారికి చెప్తూ వుంటాను. గతంలో నాకు రోజుకి సరాసరి ఇటువంటివి 5 ఫోన్లయినా దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చేవి. కానీ 'కోవిడ్-19' దేశ వ్యాప్త లాక్‌డౌన్ తర్వాత వీటి సంఖ్య పదింతలు పెరిగింది. విచిత్రంగా చాలామంది మహిళల వద్దనుండి ఈ ఫోన్లు వస్తున్నాయి.

సాధారణంగా మన గ్రామీణ ప్రాంతాలలో పేదవారు తమకు అందుబాటులో వున్న మూలికలు, దినుసులు రోజు వారి గృహవైద్య చిట్కాలను ఉపయోగించి మిశ్రమాలను, ఔషధాలను వారే తయారు చేసుకొని చికిత్స చేసుకుంటూ వుంటారు. ఇది మనుష్యులకైనా, జంతువులకైనా వర్తిస్తుంది. ఈ విధంగా మన సాంప్రదాయ జ్ఞానం వీరికెంతో ఉపయోగ పడుతుంటుంది. ప్రత్యేకించి బైటికి రాకూడదు అన్న ఈ లాక్‌డౌన్ సమయంలో ఇది ఎంతోమందికి ప్రాణదానం చేస్తోంది.

ఆచార్య అనిల్ గుప్తా గారి మార్గదర్శకత్వంలో హనీబీ నెట్‌వర్క్ (పల్లెసృజన కూడా ఇందులో భాగమే) వారు ఇటువంటి సాంప్రదాయ వైద్య సంబంధ వివరాలను సేకరించి గ్రంథస్థం చేసి వుంచడం వలన ఎందరికో మేలు జరుగుతోంది. దీనికి మనమంతా గుప్తా గారికి, హనీబీ వారికి ధన్యవాదాలు చెప్పుకోవాలి.

భవిష్యత్‌లో కూడా టెలిఫోన్ ద్వారా పశువైద్య చిట్కాలు (క్రూర జంతువులకైనా సరే) కొనసాగిస్తానని దేశంలో ఎవరికైనా సరే వీటికి సంబంధించిన అవసరం వచ్చినప్పుడు మూలికా వైద్య చిట్కాలకై నా సెల్ నెంబరు 94372 902588 ప్రతిరోజూ ఉదయం 7-30 నుండి 9 గంటల లోపల, సాయంకాలం 7 నుండి 9 గంటల లోపల అందుబాటులో వుంటానని తెలియజేస్తున్నాను. హిందీ, ఇంగ్లీషు, ఒరియా భాషల్లో సంప్రదింపులు జరపవచ్చు.

**మెయిల్ అడ్రస్**
drbalarams10@gmail.com
**ట్విట్టర్**
@balaramsahu




## సౌరశక్తితో పనిచేసే ఇస్త్రీ బండి

విద్యార్థి పేరు : వినిష ఉమాశంకర్

**9వ తరగతి, ది పాల్ గ్లోబల్ స్కూల్, మలపంబాడి తిరువణ్ణామలై, తమిళనాడు**



వినిష సౌరశక్తితో పనిచేసే ఇస్త్రీ బండిని తయారు చేసింది. సోలార్ ప్యానెల్స్ సహాయంతో ఇది సాధించవచ్చు. సూర్యరశ్మి లేనపుడు ఇస్త్రీ పెట్టెని ముందుగానే ఛార్జి చేసిన బ్యాటరీల ద్వారా కానీ, నేరుగా కరెంటుతో కానీ, డీజిల్‌తో నడిచే జనరేటర్ సహాయంతో కూడా ఇది పని చేస్తుంది. అన్నింటికన్నా ముఖ్యం ఇస్త్రీ పెట్టెని వేడి చెయ్యటానికి బొగ్గు వాడవలసిన పని లేదు. బొగ్గు ద్వారా జనించే నిప్పు రవ్వల కారణంగా బట్టలు కాలిపోతాయన్న ప్రమాదం లేదు. తోపుడు బండిలో అమర్చబడింది కనుక ఎక్కడికి కావాలంటే అక్కడికి తోసుకుని వెళ్ళి సేవలు అందించవచ్చు. అదనపు ఆదాయం ఆర్జించటంలో తోహద పడుతుంది. ఇంకా అదనపు ఆదాయం కావాలనుకుంటే బండికే రూపాయి బిళ్ళలు వేస్తే పని చేసేలా కాల్ ఫోన్ (జిఎస్ఎం)ను, మొబైల్ ఛార్జింగ్ వంటి అదనపు సౌకర్యాలను కూడా ఏర్పరచుకోవచ్చు అంటోంది వినిష.

ఈ అమ్మాయికి సైన్స్ & టెక్నాలజీని మేళవించి సమస్యలు పరిష్కరించటం అంటే ఇష్టం. ప్రశ్నలడిగి, సమాధానాలు తెలుసుకోవటంలో ఆసక్తి ఎక్కువ. పుస్తకాలు చదవటం అంటే చాలా ఇష్టం. ఈవయస్సు దాకాపు 400 పుస్తకాల



గ్రంథాలయం ఏర్పరచుకుంది. నాట్యం చెయ్యటం, సంగీతం సాధన, చిత్రలేఖనం, చిన్న గేయాలు రాయటం, యోగా, కసరత్తు .... ఇలా చాలా విషయాలంటే ఇష్టం ఈ అమ్మాయికి. పెద్దయ్యాక ప్రజల కష్టాలు తీర్చి వారి జీవితం ఆనందమయం చేసే వస్తువులు కనిపెట్టే శాస్త్రవేత్తనవ్వాలని కోరిక.... తథాస్తు.

## అంధులకి సౌకర్యంగా వుండే శౌచాలయాలు

**వైభవ్ పరిదా, 8వ తరగతి**
**డి.ఎ.వి. పబ్లిక్ స్కూల్, చంద్రశేఖరపూర్,**
**ఖోర్దా, ఒడిస్సా**



అంధుల జీవితం కష్టతరమైంది. అలవాటైన ప్రదేశం అయితే కొంత నయమేమో కానీ, కొత్త ప్రదేశాలలో వీరు చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ప్రత్యేకించి పబ్లిక్ టాయిలెట్‌లలో దారి తెలీక చాలా శ్రమపడతారు. అటువంటి వారికోసం వైభవ్ ప్రత్యేక శౌచాలయం ఉండాలంటాడు. కళ్ళు కనిపించని వారికి మాటలతో మార్గదర్శకాలిస్తుంది, దాంతో అంధులకు శౌచాలయం ఉపయోగించడం సులభమవుతుంది. నేలమీద పరచిన పలకల డిజైన్ వీరికి అనుకూలంగా ఉండేలా చేయవచ్చు (రెండు పలకలు ఒకేచోట ఎత్తుగా ఉండటం). నీళ్ళ కుళాయిలలో ఎక్కువ తక్కువ రావటానికి ప్రత్యేక ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పద్ధతిలాంటివి ఏర్పాటు చేయాలి.

వైభవ్‌కి కథల పుస్తకాలు చదవటం ఇష్టం. విమానాలంటే అతనికి ప్రత్యేకమైన ఇష్టం. పెద్దయ్యాక ఏరోనాటికల్ ఇంజనీరు అవుదామనుకుంటున్నాడు.

ఎన్.ఐ.ఎఫ్. వారు అహమ్మదాబాద్ లోని బ్లైండ్ నేషనల్ అసోసియేషన్ వారి సహాయంతో అటువంటి శౌచాలయం నమూనాను నిర్మిస్తోంది.

## పెద్దగా చేసుకునేందుకు వీలైన టిఫిన్ డబ్బా

**జి. పద్మశ్రీ, 6వ తరగతి,**
**జి.కె. హెచ్. పబ్లిక్ స్కూల్,**
**దొడ్డ బొంపల్లి, కోలార్, కర్నాటక**




ప్రయాణాలు చేసేటప్పుడు కానీ, కార్యాలయాలకు తీసుకు వెళ్ళేటప్పుడు కానీ, పిల్లలు పాఠశాలలకు టిఫిను డబ్బాలు తీసుకెళ్ళేటప్పుడు కానీ క్రింద పడకుండా తినటం కష్టంగా వుంటుంది. డబ్బా పెద్దగా వుంటే తినటానికి సులువుగా ఉంటుంది కదా!

దీనికి ఒక పరిష్కారం చేయాలనే ఆలోచన వచ్చింది 6వ తరగతి చదువుతున్న పద్మశ్రీకి. ఆమె పాఠశాలకు తీసుకుపోయే టిఫిను డబ్బా అవసరమైనప్పుడు పెద్దగా చేసుకునేటట్లు, అవసరం లేనప్పుడు చిన్నగా సర్దుకునేలా తయారు చేసింది. బొమ్మలో చూపించి నట్లు వివిధ







పదార్థాలున్న నాలుగు చిన్న డబ్బాలు పెద్ద బాక్స్‌లో పెట్టి, తినే సమయంలో బయటకు తీసి, పెద్ద డబ్బాకు బొమ్మలో చూపినట్లుగా తగిలించాలి. దాంతో పెద్ద టిఫిన్ డబ్బా ఖాళీ అయిపోయి, కంచంగా మారుతుంది. చిన్న డబ్బాల్లోంచి కూరలు, అన్నం పెద్ద డబ్బాలో వేసుకుని భోజనం చెయ్యవచ్చు. అంతే కాకుండా డబ్బా మూతలో రెండు స్పూన్లు కూడా బొమ్మలో చూపినట్లుగా అమర్చుకుంటే ఎక్కడైనా టిఫిన్ డబ్బాలో భోజనం చెయ్యడం సౌకర్యంగా వుంటుంది. డబ్బా మూత లోపల ఆరోగ్యానికి సంబంధించిన సూచనలు కూడా వ్రాయవచ్చు.

పద్మశ్రీకి పాటలు పాడటం, నృత్యం చేయటం, పుస్తకాలు చదవటం మొదలైనవి చాలా ఇష్టం. వీలు చిక్కినప్పుడల్లా తన తల్లికి ఇంట్లో పనులకు సహాయం చేస్తుంటుంది అమ్మాయి. పెద్దయ్యాక రక్షణదళంలో పనిచేసి దేశ సేవ చేస్తానంటోంది పద్మశ్రీ. శుభం.

## పురుగులని చంపే చెత్త డబ్బా



**తన్మయ కుమార్ సేథి, 7వ తరగతి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, రూర్కెలా, ఒడిస్సా.**

మూత వున్న, మూత లేని చెత్త డబ్బాల వద్దకు చాలా పురుగులు చేరుతాయి. ఈ పురుగులను ఆకర్షించి చంపే పరికరాన్ని మూతలో బిగిస్తే పురుగులు డబ్బా దగ్గరికి రాగానే చనిపోతాయి. దీనివల్ల చెత్త డబ్బా, పరిసరాలు శుభ్రంగా వుండి, సమాజ ఆరోగ్యానికి తోడు చేస్తాయి అంటున్నాడు తన్మయ.

తనకు బాడ్మింటన్ ఆడటం అంటే సరదా. పెద్దయ్యాక ఐ.ఏ.ఎస్. సాధించి ప్రజలకు సేవ చేయాలన్నది ఇతని ఆశయం. శుభాస్తు.



# అలుపు లేకుండా, సరైన దూరంలో విత్తనం వేసే 'గార్రె అశోక్ జడిగం'



- జమ్ములమడక శశిమోహన్
- పల్లె వీరరాఘవ రెడ్డి

ఏరువాక మొదలవబోతోంది. రైతాంగం పొలంలో విత్తనాలు నాటేందుకు పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. పల్లెల్లో రైతులు చేసే ప్రతి పని కెమెరా కళ్ళే కాదు, ఏ కళ్ళతో చూసినా ఎంతో అందంగా కనబడే వాటిలో విత్తనం వేయటం ఒకటి. విత్తనాలను ఎద్దులతో జడిగంలో వేస్తూ విత్తడం ఒక పద్ధతి అయితే కొన్ని రకాల విత్తనాలు ఉదా.: మొక్కజొన్న, ప్రత్తి లాంటి వాటిని రాళ్ళు తోలుకుని, మనుషులతో సమాన దూరంలలో నాటించడం మరో పద్ధతి. ఇలా మనుషులు చేతితో విత్తే పని చూడటానికి అందంగా కనిపిస్తుంది కానీ, విత్తే వాళ్ళకు తెలుసు అందులోని బాధ. ప్రతి విత్తనానికి వంగుని భూమిలో విత్తనం వేసి, దానిపైన మట్టిని కప్పడం అనే ప్రక్రియలో రోజుకు ఎన్నోసార్లు వంగుని లేవాల్సి వస్తుంది. రాత్రికి దాని తాలూకు నడుము నొప్పితో అల్లాడిపోయే వారు, ముఖ్యంగా మహిళలు ఎంతోమంది ఉంటారు. వీరు ఇక నడుంనొప్పితో బాధ పడాల్సిన అవసరం లేకుండా ఒక మందు కనిపెట్టారు అశోక్. మందు అంటే నడుముకు రాసుకునే లేపనం కాదు. అసలు నడుము వంచకుండానే విత్తే ఒక పనిముట్టు తయారు చేశాడు మన ఇన్నోవేటర్ 'గార్రె అశోక్'.

తెలంగాణ రాష్ట్రం లోని సూర్యాపేటకు చెందిన గార్రె అశోక్ గురించి పల్లెసృజన పాఠకులకు గుర్తుండే వుంటుంది. 'పల్లెసృజన'లో అత్యంత చిన్న వయస్సుగల అశోక్ (ప్రస్తుతం అతని వయస్సు 17 సంవత్సరాలు) ఇప్పటికే జాతీయ స్థాయి గుర్తింపును, రాష్ట్ర స్థాయి ప్రముఖుల మన్ననలను అందుకొన్నాడు. రైతు కష్టాలను తీర్చే చిన్న చిన్న చేతి పనిముట్లు రూపొందించాలని ఎప్పుడూ కలలు కంటూ వుంటాడితను.

మొక్కజొన్న, ప్రత్తి, వేరుశనగ మరెన్నో విత్తనాలు



జడిగం క్రింది భాగం


జడిగంతో విత్తనం


విత్తడానికి సిద్ధంగా వున్న మహిళలు

సమాన దూరంలో నాటాల్సి వుంటుంది. అటువంటి విత్తనాలను మనుషులు మాత్రమే చాళ్ళల్లో వేసుకుంటూ వెళ్లారు. ప్రతి విత్తనం వేయటం, ఆ విత్తనంపైన మట్టిని పూడ్చటం వీరు చేసే పని. అంటే ప్రతి విత్తనానికి వంగి, లేవాల్సి వుంటుంది. ఇప్పుడు ఇటువంటి విత్తనం వేసే వ్యవసాయ పరికరాలు కూడా వచ్చాయి కానీ, అవి ఖరీదు ఎక్కువ పైగా అవి చాలా పెద్దగా వుంటాయి. చిన్న చిన్న కమతాలలో వాటితో విత్తనం వేయటం కుదరదు.

ఉదాహరణకు 'అశోక్ జడిగం'తో వేసుకునే విత్తనం నాటితే, సమాన దూరంలో ఒక్కో విత్తనమే పడటం వల్ల మొక్కల మధ్య సమాన దూరం వుండి, వాటికి అవసరమైన గాలి, సూర్యరశ్మి లభించటం వల్ల పంట ఆరోగ్యంగా పెరిగి మొక్కల్లో ఎక్కువగా దుబ్బులు ఏర్పడతాయి. కాయలు కూడా ఎక్కువగా కాస్తాయి. ఈ విత్తన పద్ధతి వల్ల విత్తనం ఖర్చుతో పాటు కూలీల ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుంది.


'అశోక్ జడిగం' ను వాడుతున్న మహిళా రైతు

అశోక్ జడిగంతో విత్తనం వేయటం ఎంతో సులభం. జడిగాన్ని భూమిలో పెట్టి పైన విత్తనం వేసిన తర్వాత దాన్ని తీసేటప్పుడు కాస్త ముందుకు వంచి తీయాలి. అలా వంచి తీసేటప్పుడు ఈ జడిగానికి ఏర్పాటు చేసిన స్ప్రింగు ద్వారా జడిగం గొట్టానికి క్రింద వున్న ద్వారం తెరుచుకుని, విత్తనం భూమిలోకి పడుతుంది. వెంటనే తీయటం వల్ల మళ్ళీ ఆ ద్వారం వల్ల మట్టి విత్తనం పైకి వేయబడి పూడుకు పోవటంతో పాటు తరువాతి విత్తనం ఎక్కడ నాటాలో ఒక గుర్తు ఏర్పడుతుంది. మొక్కకు మొక్కకు మధ్య దూరం 6 అంగుళాలు వుంటుంది. తర్వాత ఆ గుర్తుపైన ఈ జడిగాన్ని నాటుకుంటూ అలా విత్తనం వేసుకుంటూ వెళ్ళడమే. ఈ పరికరం బరువు లేకుండా తేలిగ్గా వుంటుంది. దీని ఎత్తు మూడున్నర అడుగులు వుంటుంది. వీళ్ళే మనిషి, విత్తనం వేయటానికి, మట్టిని పూడ్చటానికి వంగాల్సిన అవసరం ఏమాత్రం లేదు. కాబట్టి ఎటువంటి అలుపు లేకుండా సమాన దూరంలో విత్తనం వేసుకోవచ్చు.

దీన్ని ఉపయోగించిన రైతు కూలీలు మొదట్లో అలవాటు అయ్యే వరకు (కొద్ది గంటలు మాత్రమే) కాస్త అసహనంగా వుంటుంది కానీ, అలవాటైన తర్వాత వేగం పెరగటం, ఎటువంటి అలసట లేకుండా పని జరగటం లాంటి ఎన్నో ఫలితాలు వుంటాయని అన్నారు. దీని ఖరీదు కూడా చాలా తక్కువ కాబట్టి ఏ స్థాయి రైతైనా దీన్ని కొనుగోలు చేయగలరు.

చిన్న కమతాల రైతులు అశోక్ జడిగాన్ని విరివిగా ఉపయోగించుకొని విత్తడంలో శ్రమను చాలావరకు తగ్గించుకొని, అధిక దిగుబడులు సాధించాలని 'పల్లెసృజన' కోరుకుంటోంది. ఇలాంటి జడిగాలతో మీరు చేసిన ప్రయోగాలను, అనుభవాలను 'పల్లెసృజన'తో పంచుకోగలరని ఆశిస్తున్నాము.

ఇన్నోవేటర్ గాజ్రె అశోక్, ఫోన్ : 63052456698

## డా.ఎ.పి.జె. అబ్దుల్ కలాం

# పిల్లల సృజనాత్మక పోటీలు - 2020



డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం స్మృత్యర్థం హనీబీ నెట్‌వర్క్, సృష్టి మరియు గ్యాన్ (gian) సంయుక్తంగా విద్యార్థుల "సాంకేతిక సృజనాత్మక ఆలోచనల పోటీ" నిర్వహిస్తోంది. ఈ పోటీలలో 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు లేదా ఈ మధ్యలో చదువు మానేసిన విద్యార్థులు పాల్గొనడానికి అర్హులు.

వీటికై దరఖాస్తులు ఇంగ్లీషులో కాని, హిందీలో కాని 15 సెప్టెంబర్ 2020 లోగా గూగుల్ మాధ్యమం https://bit.ly/2Rx0NtP లోని దరఖాస్తు ద్వారా పంపవలెను.

ఈ పోటీలు పిల్లల లోని సృజనాత్మకతను పెంపొందించడానికి ఉద్దేశించ బడినది కనుక **దయచేసి పిల్లల తల్లిదండ్రులు కాని, అధ్యాపకులు కాని తమ స్వంత ఆలోచనలు పిల్లల పేరున పంపవద్దని మనవి.**

పిల్లల తల్లిదండ్రులకు మనవి చేసేది ఏమిటంటే, మీరు పిల్లలకి మన దైనందిన జీవితంలో ఎదురవుతున్న కష్టాలపై వారికొక అవగాహన కల్పించండి. పెరుగుతున్న ఖర్చులు, తగ్గిపోతున్న ఫలితాలు గురించి తెలియజేయండి. వీటిపై పిల్లలని స్వంతంగా ఆలోచింపజేసి, వారి దృష్టిలో వీటికి పరిష్కారాలు కనుగొని/ సూచించే విధంగా ప్రోత్సహించమని మనవి. స్థానిక సమస్యలకు పరిష్కారాలు కనుగొనడంలో పిల్లలలో 'సంవేదన' సంస్కృతిని అలవర్చడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యము.

ఈ పోటీ ఫలితాలు మన దేశపు మాజీ రాష్ట్రపతి డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి జన్మదినమైన 15 అక్టోబర్, 2020 నాడు ప్రకటించడం జరుగుతుంది. హనీబీ నెట్‌వర్క్ ప్రతి సంవత్సరం భారత రత్న డా. కలాం గారి జన్మదినాన్ని 'పిల్లల సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్' పండుగగా జరుపుకుంటోంది. ఎంపికైన ఉత్తమ ఆలోచనలకు నమూనాలు తయారు చేయటంలో, వాటికి పూర్తి రూపం కల్పించటంలో, అర్హత కలిగిన వాటికి పేటెంట్ ఇప్పించడం జరుగుతుంది.

పిల్లలు తమ ప్రయోగాల ఆలోచనలను గూగుల్ మాధ్యమం https://bit.ly/2Rx0NtP లోని దరఖాస్తు ద్వారా 15 సెప్టెంబర్ 2020 లోగా పంపించవలెను. ఆ తేదీ తర్వాత వచ్చిన దరఖాస్తులను ఈ సంవత్సరం కాకుండా వచ్చే సంవత్సరపు పోటీలలో పరిశీలనకు స్వీకరించ బడతాయి.

**ఇంకా సమాచారం కావాలనుకున్నవారు క్రింది చిరునామాలో సంప్రదించండి**

**SRISTI**
Gujarat University Boys Hostel Campus,
Nr. Gujarat University SBI bank & Sport complex (Ground)
Ahmedabad - 380009, Gujarat.
Phone: 079: 27913293/ 27912792 www.sristi.org

# ఆయుర్వేద జ్ఞాన మథనం

# ఆచారాలు, పండగలు, సాంప్రదాయాలు



మన ఆచారాలు, పండుగలు, సాంప్రదాయాలను పుక్కిటి పురాణాలు, పూర్వీకుల మూఢ విశ్వాసాలు అంటూ కొట్టి పారేసి, పాశ్చాత్య సాంప్రదాయం వైపుకు పరిగెడుతున్న నేటి తరానికి ప్రకృతి తన కోపాన్ని రుచి చూపిస్తోంది 'కరోనా' రూపంలో అని ఇప్పటికే అర్థమైంది. మనం ఎంత తప్పు చేశాము, చేస్తున్నాము అని గ్రహించి ప్రస్తుతం యువత మళ్ళీ మన సాంప్రదాయ బాటను పడుతోంది. మన పూర్వీకులు చూపిన మార్గం మన దేశాన్ని ప్రస్తుతం అన్ని ప్రపంచ దేశాల నోళ్ళలో నానేలా చేయటమే కాక, అవి మనదేశం వైపే చూస్తూ, వారు కూడా మన సాంప్రదాయాలను పాటించేలా చేయిస్తోంది. సాహేతుకంగా ఆచరించే మన ఆచారాలు, పండుగలు, సాంప్రదాయాలు ఇప్పుడు నిరూపితం కావడం వల్ల మరో మెట్టు ఎక్కినట్లయింది మన భారత దేశం. ప్రస్తుతం ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలు మన ఆచారాలు, సాంప్రదాయాలు, నడవడిక ఎలా ఉన్నాయో ఎంతో ఉత్సుకతతో గమనిస్తున్నాయి/ ఆచరిస్తున్నాయి.

పూర్వం ఆవు పిడకలను కాల్చి, బూడిద చేసి, ఆ బొగ్గుతో పళ్ళు తోముకునేవారు. అందువల్ల పళ్ళకి సంబంధించిన ఎటువంటి జబ్బులూ వచ్చేవి కావు. అలా బొగ్గును తోమే రోజుల్లో జిల్లా కేంద్రంలో రెండు లేదా మూడు దంత వైద్య శాలలు ఉండేవి. వ్యాపార సంస్థలు విష ప్రచారం చేస్తూ బొగ్గు, వేప పుల్ల, కానుగ పుల్ల, ఉప్పు లాంటివి రుద్దుకోవటం వల్ల చిగుళ్ళ దెబ్బ తిని దంతాలు పాడవుతాయి అని ప్రచారం చేసి 'టూత్ పేస్ట్'ను మన నెత్తిన రుద్దుతున్నాయి.




ఉదాహరణకి బొగ్గుతో తోమితే పళ్ళు చెడిపోతాయి అని చెప్పి, మళ్ళీ అదే బొగ్గు ఉన్న టూత్ పేస్ట్‌ను వాడమంటున్నాయి. మనం మూర్ఖంగా వాడేస్తున్నాం. ప్రస్తుతం ప్రతి మండల కేంద్రంలో రెండు మూడు దంత వైద్య శాలలు ఏర్పడ్డాయి. ఇక జిల్లా కేంద్రంలో అయితే వీధి వీధిలో పదుల సంఖ్యలో దంత వైద్య శాలలు వెలిశాయి.

మరో విచిత్రమేమిటంటే ఇప్పుడు అవే టూత్ పేస్ట్ తయారీ సంస్థలు 'మీ టూత్ పేస్ట్‌లో ఉప్పు ఉందా?', '18 రకాల వన మూలికలతో తయారైనది', 'ఆయుర్వేద శాస్త్రాలను బోధించి పళ్ళి తయారైనది' అంటూ మన హైందవ సాంప్రదాయాలను తమ ప్రచారాలకు వాడుకుంటూ ఎక్కడ ప్రజలు పూర్వపు స్థితికి వెళ్తారేమో, తమ వ్యాపారాలు దెబ్బ తింటాయేమో అని తమ టూత్ పేస్ట్‌ల అమ్మకాలను సాంప్రదాయ ముసుగులో మళ్ళీ మనపైన రుద్దేందుకు పూనుకున్నాయి. మనమంతా ఇప్పటికైనా జాగ్రత్త పడకుంటే ఇంకా ఎక్కువగా దంత రోగాలకు గురి కావాల్సి వస్తుంది.

ఇంట్లో వంటకాల్లో నిమ్మరసం పిండుకున్న తర్వాత ఆ నిమ్మ తొక్కలను పారవేయకుండా, అలాగే తీసి వుంచుకుని, వాటిని ఎండిన తర్వాత ఇంట్లో అంటించి, ధూపం వేయటం ద్వారా ఇంట్లో వున్నటువంటి క్రిమి కీటకాలు చనిపోయేవి, మరి కొన్ని రోజుల వరకు అవి ఇంటి ఛాయలకు కూడా వచ్చేవి కావు.

ఉదయం లేవగానే చద్దన్నం తినటమో, రాగి లేదా జొన్న జావ త్రాగటమో చేసేవారు ఇప్పుడవన్నీ మానేసి కాఫీ, టీ, మాంసాహారాలు, పెరుగు వాడటం వల్ల రకరకాల జబ్బుల బారిన పడుతున్నారు. కూరగాయలతో చేసిన భోజనం రెండు మూడు గంటల్లో అరిగితే, మాంసాహారంతో తిన్న భోజనం అరగటానికి కనీసం 24 గంటలు పడుతుంది.

పూర్వం ఒంటికి కొబ్బరి నూనె రాసుకుంటూ వుండేవారు. తలకు అయితే తప్పనిసరిగా కొబ్బరినూనె అంటించుకునేవారు. అలా చేయటం వల్ల వైరస్‌లు మన ఒంట్లోకి చొరబడే అవకాశం వుండేది కాదు. ప్రస్తుతం ఒంటికి

కాదు కదా, కనీసం తలకు కొబ్బరి నూనె రాసుకోక పోవడమే ఫ్యాషన్‌గా మారిపోయింది. పైగా కొబ్బరినూనె తలకు రాసుకున్న వ్యక్తిని ఓ వింత జంతువులా చూస్తున్నారు. పసుపు, వేపాకు, మిరియాలు కలిపి మెత్తగా నూరి, శనగ గింజంత పరిమాణంలో మాత్రలుగా చేసుకుని, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఒక్కో మాత్ర చొప్పున వేసుకున్నట్లయితే ప్రస్తుతం ప్రపంచాన్ని వణికిస్తున్న 'కరోనా' లాంటి వైరస్‌కు దూరంగా వుండవచ్చు. అలాగే అల్లం వెల్లుల్లి భోజనంలో ఎక్కువగా వినియోగించుకోవాలి.

అశ్వగంధ పొడి 100 గ్రా., 25 గ్రా. తులసి కలిపి వుంచుకుని, రోజుకు ఒకసారి గ్లాసు పాలల్లో లేదా నీటిలో కలుపుకుని త్రాగినట్లయితే మనిషి ఆరోగ్యంగా వుంటాడు. అందుకే మన పూర్వీకులు తులసికి ఎంతో ప్రాముఖ్యతను ఇచ్చేవారు.

**మన పండుగలు వాటి ప్రాముఖ్యత :**

**తొలి ఏకాదశి :** మనకు మొట్టమొదట వచ్చే పండుగ. తొలి ఏకాదశికి పేలాలు, బెల్లం కలిపి ముద్దలు చేసి అందరూ తినేవారు అలా చేయటం వల్ల శరీరంలోని విటమిన్ లోపాలు సవరింప బడుతాయి.

**కృష్ణాష్టమి :** వాము, బెల్లం పాకం పట్టి కాయ చూర్ణం అని తయారు చేసి అందరికీ తినిపించేవారు. అప్పుడే వర్షాలు మొదలవుతుంటాయి కాబట్టి అటువంటి సమయంలో శరీరం వాతానికి గురయ్యే అవకాశాలు ఉంటాయి కనుక ఆ వాతం నుండి 'కాయచూర్ణం' రక్షించేది.

**వినాయక చవితి :** అవిరి కుడుములు (బియ్యపు రవ్వ, శనగ పప్పు ఉడికించి చేసేవి) తినేవారు. అవి తేలిగ్గా అరుగుతాయి. 21 పత్రాలతో పూజ చేస్తారు. అలా పూజ చేసేటప్పుడు అన్ని రకాల ఆకుల స్పర్శ, వాసన చూడటం జరుగుతుంది కాబట్టి ఎన్నో రకాల జబ్బులను అవి దరిచేరనిచ్చేవి కావు.

**దసరా :** పప్పు బెల్లాలు కలిపి తినటం, బతుకమ్మ ఉత్సవాలతో అనేక రకాల పూవుల వాసనలు చూడటం వల్ల కొన్ని రకాల జబ్బులు రాకుండా వుండేవి.

**దీపావళి :** నెయ్యి, నువ్వుల నూనె, ఇప్ప నూనె వంటి అనేక రకాల నూనెలతో దీపాలు వెలిగించే వారు కాబట్టి ఆ వెలుగును చూడటం వల్ల నేత్ర దోషాలు ఉండేవి కావు. ఆ నూనెతో కాలుతున్న దీపాల వాసన వల్ల కొన్ని రకాల జబ్బులు దరిచేరేవి కావు.

**నాగుల చవితి :** నువ్వుల బెల్లం, బియ్యం బెల్లం, చలిమిడిలతో వంటకాలు చేస్తారు. వీటిలో క్యాల్షియం, ఐరన్, విటమిన్‌లు బాగా వుంటాయి కాబట్టి శరీరానికి ఎంతో ఆరోగ్యాన్ని చేకూర్చేవి.

**కార్తీక పౌర్ణమి :** ఈ పండుగకు ప్రధానంగా అనేక దీపాలు వెలిగించటం వల్ల సూక్ష్మ క్రిములన్నీ నశించిపోతాయి.

**సంక్రాంతి :** ఈ పండుగకు రైతులకు పంటలన్నీ ఇంటికి వస్తాయి కాబట్టి కొత్త ధాన్యాలతో వంటకాలు, ఇంటిముందు గొబ్బెమ్మల్లో రకరకాల పూలు, రేగు పళ్ళు వేస్తారు. అలాగే రేగు పళ్ళను చిన్న పెద్ద అందరూ తినేవారు కాబట్టి శరీరంలో అరుగుదల శక్తి పెరిగేది.

**శివరాత్రి :** ఒక రోజంతా ఏమీ తినకుండా కేవలం పాలతో ఉపవాసం ఉండటం ఈ పండుగ ప్రత్యేకత. సాధారణంగా 'లంఘనం పరమ ఔషధం' అంటుంటారు పెద్దలు. అలా ఒక రోజంతా ఉపవాసం ఉండటం వల్ల ఖాళీ కడుపు కావటంతో శరీరంలోని చాలా క్రిమి కీటకాలు నశించి ఆరోగ్య వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఒకవేళ తిన్నా తృణ ధాన్యాలతో చేసిన రొట్టెల్ని తింటారు కాబట్టి, అవి కొద్దిగా తిన్నా బాగా శక్తితో కూడుకున్నవి.

**ఉగాది :** ఉగాది ప్రత్యేకత 'ఉగాది పచ్చడి'. షడ్రుచులతో కూడుకున్న (వేప, తీపి, వగరు, పులుపు, కారం, ఉప్పు) పచ్చడి తినటం వల్ల శరీరంలోని ఎన్నో రకాల క్రిములను అది తరిమి వేస్తుంది. ఈ పచ్చడి వీలైతే నెలకు ఓసారి తీసుకున్నా మంచిదే ఏలాంటి జబ్బుల బారిన పడకుండా ఉండేందుకు సహకరిస్తుంది.

**శ్రీరామ నవమి :** పెసర పప్పు బెల్లం తినటం వల్ల చలవ చేస్తుంది. మిరియాలు, బెల్లం కలిపిన పానకం త్రాగటం వల్ల వేడి నుంచి రక్షించి శరీరాన్ని సమశీతోష్ణం చేస్తుంది.

అడవులను నరికి వేయటం వల్ల కూడా కొన్ని రకాల జంతువులను ఆశించి జీవించే క్రిమి కీటకాలు జనారణ్యంలో పడి మనుషులపై దాడి చేయటం వల్ల కూడా ఎన్నో రకాల వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయి.

**గమనిక :** ఈపత్రికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు నిష్ణాతులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం. : 94402 86854

ఏడుకొండలు గారూ,

నా పేరు రాజేంద్ర రెడ్డి. విజయవాడ నివాసిని. నాకు పల్లెసృజన పత్రిక క్రమం తప్పకుండా వస్తోంది. చదివిన తర్వాత ఎంతో తృప్తికి గురవుతుంటాను. పత్రికలోని అన్ని అంశాలు చాలా సంతృప్తికరంగా వున్నాయి. నాదొక చిన్న విన్నపము. పల్లెసృజన లో ముద్రించే సేంద్రియ పురుగు మందులను గురించిన పూర్తి వివరాలు తెలియజేస్తే బావుంటుంది. అంటే ఏ మందు ఏపంటలకు, ఎటువంటి పురుగులు లేదా తెగుళ్ళకు పని చేస్తుంది, వాటిని మాకు పోస్టు ద్వారా లేదా పార్శిల్ ద్వారా పంపితే విలువ ఎంత వుంటుంది, కనిష్టంగా ఎన్ని తీసుకుంటే మీరు ఇంటికి పంప గలరో తెలియజేసినట్లయితే వాటిని మేము తీసుకుని ఉపయోగించుకోవడానికి బావుంటుంది. నేను ఎక్కువగా వరి పంట పండిస్తుంటాను. నా పంటకు ఆ మందులు ఏ విధంగా పని చేస్తాయో తెలియజేయగలరు. పల్లెసృజన ఉత్పత్తులు అమ్మకానికి సిద్ధంగా వున్నట్లు చూపిస్తున్నారే కాని, వాటిని తెప్పుకోవటం ఎలా అన్న విషయం కూడా తెలియజేస్తే బావుంటుందని నా అభిప్రాయం.

**– రాజేంద్ర రెడ్డి,** *గుంటూరు జిల్లా*

రాజేందర్ రెడ్డి గారు,

మీ అభిప్రాయాలు తెలిపినందుకు కృతజ్ఞతలు. మీరు అడిగిన అన్ని విషయాలను 'పల్లెసృజన' చర్చిస్తునే వుంది. పల్లెసృజన పత్రికల్లో, ఇన్నోవేషన్ల ప్రదర్శనల్లో, రైతులతో చర్చల్లో, వెబ్‌సైట్ ద్వారా, చిన్న శోధయాత్రలలో, వాట్సాప్ గ్రూపుల్లో ప్రజలకు, ముఖ్యంగా రైతులకు కావలసిన గ్రామ ఆవిష్కరణలను, వాటి వివరాలను పొందడానికి చేయవలసిన పద్ధతులను అందరికీ అవగాహన చేస్తూ వున్నాము. దయచేసి మీరు వాలంటీర్ సుభాష్ చందర్ (ఫోన్ 96528 01700)ను సంప్రదిస్తే మీ ప్రశ్నలన్నిటికీ జవాబులు లభిస్తాయి. మీరు సూచించిన సలహాలను మేము తప్పకుండా అమలు చేస్తాము. నమస్సులతో....

**– ఎడిటర్.**


**FORM IV**

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA) to be published in the first issue every year after the last day of February***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 3-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

**I, P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

Signature of Publisher

పల్లెసృజన

www.pallesrujana.org

అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల

# ఇన్నోవేషన్లు

## బూమ్ స్ప్రేయర్



నేటి వ్యవసాయంలో కూలీల ఖర్చును తగ్గించేందుకు, తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటకు పురుగు మందును స్ప్రే చేయటానికి అనువైన 'బూమ్ స్ప్రేయర్'. ఒక రైతు తయారు చేసిన ఈ స్ప్రేయర్ 60 అడుగుల వెడల్పులో, కేవలం ఐదు నిమిషాల్లో హెక్టార్ పొలంలో మందు పిచికారి చేస్తుంది. ఈ స్ప్రేయర్‌ను ట్రాక్టర్‌కు బిగించుట, విడదీయుట కూడా ఎంతో సులభం.

## సులభంగా నారు నాటే పరికరం క్విక్ ప్లాంటర్




నర్సరీనుండి సేకరించిన మొక్కలు భూమిలో త్వరగా, ఒకే లోతులో నాటడానికి ఉపయోగ పడేదే "క్విక్ ప్లాంటర్". మల్చింగ్ పద్ధతిలో 30 మంది చేసే పనిని, మల్చింగ్ లేకుండా 20 మంది చేసే పనిని ఈ క్విక్ ప్లాంటర్‌ను వినియోగిస్తే ముగ్గురు మనుషులతో చేయవచ్చు. దీని వలన మొక్కలు పాడవకుండా బలంగా నాటబడి ఆరోగ్యంగా పెరుగుతాయి. ఈ పరికరం ప్రత్తి, టమోటా, మిరప, వంకాయ లాంటి చిన్న మొక్కలు నాటడానికి అద్భుతంగా ఉపయోగ పడుతుంది.

## పేడతో కుండీలు, దుంగలు, పిడకలు



ఆవులు, గేదెలు పెంపకం దారులు వాటి పేడతో హోమంలో ఉపయోగించే పిడకలు, నర్సరీలలో ఉపయోగించే పూల కుండీలు, శ్మశాన వాటికల్లో కట్టెలకు బదులుగా ఉపయోగించటానికి దుంగలు తయారు చేసే పరికరాలు మార్కెట్ సిద్ధంగా ఉన్నాయి. ఆవు, గేదెలనుండి లభ్యమయ్యే పేడను ఉపయోగించి వివిధమైన పేడ ఉత్పత్తులతో గ్రామాల్లో అదనపు ఆదాయం పొందవచ్చు. ఈ పరికరాలు ఇద్దరు వ్యక్తులు, అతి తక్కువ కరెంటుతో పని చేస్తాయి.

## 'నిమటోడ్స్' (నులిపురుగు) నివారణకు మూలికల మందు



జామ, నిమ్మ, వేరుశనగ, కూరగాయలు, పూలు వగైరా పైర్లను ఆశించే 'నిమటోడ్స్' (నులిపురుగులు) వల్ల చెట్లు చనిపోతాయి. అంతే కాక వేరుకుళ్ళు, బాజా తెగులు లాంటి వేరుకు సంబంధించిన అన్ని రకాల తెగుళ్ళవల్ల పంట నష్టం దారుణంగా వుంటుంది. ఎటువంటి రసాయనాలు లేని, వన మూలికలతో తయారైన ఈ శక్తివంతమైన మందు వాడితే దిగుబడి కూడా గణనీయంగా పెరుగుతుంది.

పరికరాలు కావలసిన వారు సంప్రదించండి :

పి. వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904/ 7989038186

బి. సుభాష్ చందర్, ఫోన్ : 9652801700

PALLE SRUJANA Telugu Bi-monthly March - April 2020 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే



పల్లెసృజన చందాదారులు కండి. పల్లె జ్ఞానాన్ని వ్యాపింపచేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

Pay by "Phone Pe" to 9666 00 1678

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9666 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023

లేదా ఫోన్ పే ద్వారా చెల్లించదల్చినవారు 9666 00 1678 నెంబరుకు పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్సాప్‌లో పంపండి.

**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం |
|---|---|
| రెండు సంవత్సరాలకి | 400/- |
| పది సంవత్సరాలకి | 1,000/- |

QR code for Phone Pe
Scan & Pay Using PhonePe App

Narendra Graafix, Hyd. Ph.: 81257 99904